మంగళవారం
10-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 79
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు

- ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతిపై దాడి
- పదేళ్లు అవమానాలు, నిర్లక్ష్యం
- చరిత్రలో నిలిచే రోజు ఇది
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భూలోకంలో ఏ ప్రాంతానికైనా, ఎవరికైనా గుర్తింపు తల్లితోనే అని మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం తల్లి అని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతిపై దాడి చేయడమే కాకుండా అవమానించారని విమర్శించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ఒక వ్యక్తి, ఒక రాజకీయ పార్టీ... తమ గురించి మాత్రమే ఆలోచించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టారని కేసీఆర్ పై మండిపడ్డారు. కానీ ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని మా సహచర మంత్రులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

- మిగతా 2 లో

ధన్కర్‌పై అవిశ్వాసం!

'ఇండియా' ఎంపీల యోచన

న్యూదిల్లీ: పెద్దల సభగా పిలిచే రాజ్యసభలో రాజకీయ తుపాను చెలరేగింది. సోమవారం సభలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఎగువసభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేం దుకు సిద్ధమయింది. ఈ తీర్మానంపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పీ) సహా కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన 70 మంది ఎంపీలు సంతకం చేశారు. భారత

- మిగతా 2 లో

బీఆర్‌ఎస్‌కు అధికార కాంక్ష

- తెలంగాణ తల్లి విగ్రహం ప్రజల మనోభావాలకు అద్దం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ అభిప్రాయం చెప్పకుండా బయటే ఉండటాన్ని చూస్తుంటే వారికి అధికారం కాంక్ష మాత్రమే ఉందన్న అభిప్రాయం కలుగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆయన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో చేసిన ప్రకటనపై మాట్లాడారు. సభలో ఒకసారి ప్రకటన చేసిన తర్వాత దానిపై సహజంగా చర్చే ఉండదు. కానీ అందుకు భిన్నంగా కొత్త సాంప్రదాయానికి తెర లేపుతూ ప్రకటనపై సభ్యులందరూ తమ తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. అయితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సభకు దూరంగా ఉండటం చూస్తే వారికి తెలంగాణపై, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రేమ లేదని సభ్యులంతా భావిస్తున్నారని తెలిపారు. 13 డిసెంబరు 2014లో ఇదే సభలో నాటి సభా నాయకుడు, సీఎం

- మిగతా 2 లో

తెలంగాణ తల్లిపై వివాదాలొద్దు

- సోనియా ఉదాత్త నిర్ణయం తీసుకున్నారు
- ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో ఒక వ్యక్తి, ఒక పార్టీ ఆలోచనే తెలంగాణ సమాజం ఆలోచన అనుకోవడం తప్పు అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం శాసనసభలో ఆయన ప్రసంగిస్తూ... ఆరు దశాబ్దాలుగా రకరకాల రూపాల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజలు తెలియజేశారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరుల య్యారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆనాడు ప్రత్యేక తెలంగాణపై సోనియాగాంధీ ఒక ఉదాత్త నిర్ణయం తీసుకున్నారని, తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని 2009, డిసెంబర్ 9న ప్రకటించారని, అందుకే

- మిగతా 2 లో

పవన్‌ను చంపేస్తాం...

బెదిరింపు ఫోన్ కాల్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు ఫోన్లు కాల్స్ వచ్చాయి. చంపేస్తామని హెచ్చరిస్తూ ఓ ఆగంతకుడి నుంచి ఫోన్లు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అభ్యంతకర భాషతో హెచ్చరిస్తూ సందేశం పంపారు. బెదిరింపు కాల్స్, సందేశాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి పేషీ సిబ్బంది తీసుకువెళ్లారు. బెదిరింపు కాల్స్

- మిగతా 2 లో

ఈ పార్లమెంటు సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు !

న్యూదిల్లీ: జమిలి ఎన్నికల కోసం మోదీ సర్కారు ఆరాటపడుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లేదంటే వచ్చే సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి సిఫార్సు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ... దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లు సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేపీసీ సంప్రదింపులు జరపడంతోపాటు అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలని సూచిస్తూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమర్పించిన నివేదికకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఒక దేశం-ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని కోవింద్ కమిటీ పేర్కొంది. అయితే, దీనికోసం రాజ్యాంగ సవరణలను కమిటీ సిఫార్సు చేసింది. జమిలి ఎన్నికల ప్రతిపాదనలపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 30కిపైగా పార్టీలు దీన్ని సమర్థించగా... కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్

- మిగతా 2 లో

తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయం చేస్తే చరిత్ర క్షమించదు

సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయం చేస్తే చరిత్ర క్షమించబోదని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు అన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండడమే తల్లి రూపమని, తెలంగాణ తల్లి చేతిని చూస్తే ఆశీస్సులు ఇస్తున్నట్టుగా ఉన్నదన్నారు. డిసెంబరు 9న పర్వదినోత్సవంగా జరపాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఆనాటి పోరాటం ఫలితంగా విజయం సాధించిన నాటి 'సెప్టెంబరు 17' ను ఎటువంటి బేషజాలు, బింకాలకు పోకుండా అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'తెలంగాణ తల్లి' విగ్రహ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనపై సోమవారం జరిగిన చర్చలో కూనంనేని మాట్లాడుతూ తమ మనసులో అనుకున్నట్టు అన్నీ ఉండబోవని, ప్రస్తుతం ఉన్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదని అన్నారు. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చుకోవచ్చుగానీ... తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా రూపకల్పన చేస్తే తప్పు జరిగినట్లా?, తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన విషయంలో నాటి ప్రతిపక్ష పార్టీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆహ్వానించిందా అని ప్రశ్నించారు. విధి విధానాలు ఎలా ఉండాలో, ఆవిష్కరణలో ఉండాల్సిన అనేక అంశాలపై ఎవరితోనూ గత ప్రభుత్వం చర్చించలేదని, తమను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆహ్వానించలేదని, కనీసం గౌరవించలేదని తెలిపారు. విశాలాంధ్ర కోసం అనేక త్యాగాలు చేసిన సీపీఐ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడిందని, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా గతంలో సీపీఐ జాతీయ సమితి నిర్ణయం తీసుకున్న విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిష్కరణ కావాల్సిందేనని సీపీఐ జాతీయ నాయకులు ఎ.బి.బర్ధన్, సురవరం సుధాకర్ రెడ్డి, డి.రాజా, కె.నారాయణ అనేక మంది నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో వస్తే తెలంగాణ రాష్ట్రం ఇస్తామని నాడు సోనియాగాంధీ చెప్పిన విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సీపీఎం తటస్థంగా,

- మిగతా 2 లో

ఆర్‌బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

న్యూదిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నూతన గవర్నర్‌గా రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారంతో ముగియడంతో తదుపరి గవర్నర్‌ను కేంద్రం నియమించింది. 2018లో ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్... పదవీ కాలం 2021లోనే ముగియగా కేంద్రం మరో మూడేళ్లు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబర్ 10తో ముగియనుండడంతో కొత్త గవర్నర్ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. మల్హోత్రా ఆర్‌బీఐకి 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. డిసెంబర్ 11 నుంచి మూడేళ్లు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. సంజయ్ మల్హోత్రా 1990 బ్యాచ్ రాజస్థాన్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఐఐటీ కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన... అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ అభ్యసించారు. విద్యుత్, ఆర్థిక, పన్నులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మైన్స్ తదితర రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని రెవెన్యూ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆర్థిక, పన్నుల విషయంలో అపార అనుభవం గల సంజయ్ మల్హోత్రా... ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు.

ఎమ్మెల్సీగా గోపిమూర్తి విజయం

విశాలాంధ్ర-కాకినాడ: రాష్ట్ర శాసన మండలికి సంబంధించి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయం సాధించారు. స్థానిక జేఎన్‌టీయూ కాకినాడ ప్రాంగణంలోని డా.బీఆర్ అంబేద్కర్ లైబ్రరీలో సోమవారం ఓట్ల లెక్కింపు జరిగింది. ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు

- మిగతా 2 లో

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

ఏఐడీఆర్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే

2లో

ఇదీ లోకం!

హక్కుల కోసం నిరంతర పోరు

అదానీతో రేవంత్ అక్రమ సంబంధాన్ని బయటపెడతాం: బీఆర్‌ఎస్ నేత కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అదానీల అపవిత్ర కలయిక, వారి కుమ్మక్కు పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని, రేవంత్ రెడ్డిని నిలదీస్తామని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీకి అనుచిత లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నా డని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దిల్లీలో అదానీతో కొట్లాడుతున్నట్టు నాటకాలు ఆడుతూ... తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రాజెక్టులను, తెలంగాణ వనరులను అదానీకి దోచిపెట్టే కుట్ర చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే కుట్రలను ఎండగడతా మని కేటీఆర్ అన్నారు. బలవంతంగా భూములు గుంజుకుంటున్న వారి పక్షాన పోరాడుతునే ఉంటామని స్పష్టం చేశారు. పార్లమెంటులో ఒక నీతి, శాసనసభలో ఒక నీతి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పార్లమెంటరీ నిబంధనలు దేశమంతా ఒకే విధంగా ఉండాలని అన్నారు. అసెంబ్లీ సమావేశాల మొదటిరోజే రోడ్డు మీద నిలబెట్టారని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ ముందు నిలబెట్టడం దుర్మార్గమైని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్, ప్రియాంకతో పాటు 100 మంది ఎంపీలు అదానీ, ప్రధాని బొమ్మ వేసుకొని పార్లమెంటు లోపలికి వెళ్లవచ్చు గానీ తెలంగాణలో అసెంబ్లీ లోపలికి వెళ్లొద్దని అడ్డుకుంటున్నారని

- మిగతా 2 లో

ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందే

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- రైతుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు



న్యూదిల్లీ: పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభించేలా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ మేరకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులకు సరసమైన ధరలను పొందేందుకు, కార్పొరేట్ల దోపిడీ నుండి వారిని రక్షించడానికి ఈ న్యాయబద్ధ డిమాండ్ వారి ప్రాథమిక హక్కుల్లో భాగమైందని రాజా పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు... వ్యవసాయ సమాజ సమస్యలు పరిష్కరించకుండా వ్యవసాయ సంక్షోభాన్ని నిరంతరం నిర్లక్ష్యం చేసింది. ఇది గ్రామీణ భారతంలో రుణాలు, ఆత్మహత్యలు పెరగడానికి, పేదరికం తీవ్రమవడానికి దారి తీసిందని తెలిపారు. రైతు వర్గాల ప్రయోజనాలను కాపాడే చట్టాలను తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందంటే... రైతుల కష్టాలపై ప్రభుత్వ నిరాసక్తత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రైతుల ప్రాథమిక హక్కు, వారి మనుగడకు అవసరమైన

- మిగతా 2 లో

అవినీతి ఆరోపణలపై కోర్టు విచారణకు నెతన్యాహూ

జెరుసలేం: గాజాపై యుద్ధం కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ యుద్ధనేరాల అభియోగాలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్టు వారెంట్ ఎదుర్కొంటున్నారు. దీనితోపాటు స్వదేశంలో అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసుల్లో ఆయన తొలిసారి న్యాయస్థానం బోనెక్కనున్నారు. వీటి విచారణ మంగళవారం మొదలుకానుంది. దీంతో నేరారోపణలు ఎదుర్కొంటున్న తొలి ఇజ్రాయెల్ ప్రధానిగా నిలవనున్నారు. మోసం, నమ్మకద్రోహం, అవినీతి ఆరోపణలు... మూడు వేర్వేరు వ్యవహారాలకు సంబంధించి ఆయనపై న్యాయస్థానంలో విచారణ మొదలుకానుంది. గతంలో వచ్చిన ఈ ఆరోపణలను నెతన్యాహూ ఖండించారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానం, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు కలిగిన నేతగా పేరొందిన ఆయన... అవినీతి ఆరోపణల కేసులో కోర్టు బోను ఎక్కనుండటం కీలకంగా మారింది. ప్రస్తుతం గాజా యుద్ధం కొనసాగుతుండటం, హెజ్బొల్లాతో కాల్పుల విరమణ ఒప్పందం వంటి కారణాలతో అవినీతికి సంబంధించిన కేసుల విచారణను ఆలస్యం చేసేందుకు నెతన్యాహూ యత్నించారు. కానీ, డిసెంబర్ 10 నుంచి విచారణ మొదలుపెట్టాలని న్యాయమూర్తులు ఆదేశించడంతో ఆయన న్యాయస్థానంలో హాజరుకాక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా టెల్ అవీవ్ కోర్టులోని భూగర్భ ఛాంబర్‌ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. నెతన్యాహూపై విచారణ మొదలుకానుండటం ఆయన సన్నిహితుల్లోనూ ఆందోళనలు రేకెత్తిస్తోంది. కీలక దస్త్రాలు, రహస్య సమాచారం లీకు సంబంధించి వివిధ కేసుల్లో ప్రధాని సహాయకులు ఆరోపణలు ఎదుర్కొంటుండటంతో వారిలోనూ భయాలు మొదలైనట్లు తెలుస్తోంది. ఈ కేసులతో ప్రధానికి నేరుగా సంబంధం లేనప్పటికీ ఇవి ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేవనే వాదన వినిపిస్తోంది.

అసద్ 'కుటుంబ బంకర్' వైరల్

డమాస్కస్: తిరుగుబాటుదళాలు సిరియా రాజధాని డమాస్కస్‌ను ఆక్రమించుకోవడంతో అధ్యక్షుడు బషర్-అల్-అసద్ దేశాన్ని విడిచివెళ్లారు. మరోవైపు డమాస్కస్‌లోని అధ్యక్షుడి విలాసవంతమైన ఆయన నివాసంలోకి ప్రజలు చొరబడి... ఆయన ఇంట్లోని ప్లేట్లు, ఫర్నిచర్ తదితర వస్తువులు ఎత్తుకెళ్లారు. అధ్యక్షుడి నివాసానికి సంబంధించిన కొన్ని వీడియోలు బయటకు వచ్చాయి. ఓ వీడియోలో సిరియా మాజీ అధ్యక్షుడి 'ఫ్యామిలీ బంకర్' దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఆందోళనకారులు అసద్ ఇంటి తలుపులు తెరిచిన తర్వాత ఓ సొరంగ మార్గం బయటపడిందని, అందులో వారికి సంబంధించిన బంగారు ఆభరణాలు, ఆయుధాల నిల్వలు భారీగా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వీడియోలో అధ్యక్షుడి నివాసం లోపల భారీ సొరంగం, దాని చివర్లో చెల్లాచెదురుగా పడి ఉన్న పెట్టెలు, ఇతర వస్తువులు, విశాలమైన గదులు కనిపిస్తున్నాయి. మరో వీడియోలో అధ్యక్షుడికి సంబంధించిన ప్రైవేటు గ్యారేజీలో కోట్ల రూపాయల విలువైన పోర్ష్, లంబోర్గిని, ఫెరారీ, మెర్సిడెజ్- బెంజ్, ఆడీ వంటి లగ్జరీ కార్లు ఉన్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. మరోవైపు తిరుగుబాటుదారులు వివిధ బ్యాంకులపై దాడి చేసి, నగదు పెట్టెలతో పారిపోయినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి. సాయుధ తిరుగుబాటుదారులు దేశ రాజధాని డమాస్కస్ సహా అనేక నగరాలను ఆక్రమించుకుంటుండడంతో దేశాధ్యక్షుడు బషర్ అల్- అసద్ దేశం విడిచి వెళ్లి రష్యాలో ఆశ్రయం పొందుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన సిరియాను వదిలివెళ్లిన వెంటనే తిరుగుబాటుదారులు స్పందిస్తూ.. నిరంకుశ పాలన నుంచి సిరియాకు విముక్తి లభించిందని సంబరాలు చేసుకున్నారు. వీరి కుటుంబ పాలనలో 50 ఏళ్ల అణిచివేత, 13 సంవత్సరాల దౌర్జన్యం వల్ల ఎందరో సిరియన్లు ఇతర దేశాలకు వెళ్లిపోయారని, ఈ రోజుతో తాము ఈ చీకటి కాలానికి ముగింపు పలుకుతున్నామని తెలిపారు. సిరియాలో కొత్త శకం ప్రారంభమైందని ప్రకటించారు. తాజా పరిణామాలపై సిరియా ప్రధానమంత్రి మహమ్మద్ ఘాజీ జలాలీ స్పందించారు. ప్రతిపక్షాలకు అధికార బదిలీ చేసేందుకు తాము సిద్ధమంటూ వీడియో సందేశం విడుదల చేశారు. తాను స్వదేశంలోనే ఉన్నానన్నారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చేయొద్దని తిరుగుబాటుదారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

ఏఐడీఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే

విశాలాంధ్ర-హిమాయత్‌నగర్: దేశంలో ప్రైవేటు రంగం రోజురోజుకు విస్తరిస్తోందని, ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందుతున్న ప్రైవేట్ రంగ సంస్థల్లో రిజర్వేషన్లు లేకపోవడంతో దళితులకు ఆ రంగంలో ప్రాధాన్యత లేకుండా పోయిందని ఏఐడీఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే అన్నారు. సోమవారం హిమాయత్ నగర్ రాజ్ బహదూర్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐడీఆర్ఎం జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.బాలనరసింహ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఏసురత్నం, మారుపాక అనిల్ కుమార్, డీహెచ్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రాజ్ కుమార్, జె.కుమారస్వామి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.లక్ష్మీనారాయణ, కె.సహదేవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ పాండే మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలపై దాడులు తీవ్రమయ్యాయని తెలిపారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా చెందవలసిన హక్కులను సైతం మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. మోదీ సర్కార్ కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ దేశ సంపదను కొద్దిమందికే చెందే విధంగా పాలన కొనసాగిస్తోందని అన్నారు. దళితులకు ఈ దేశ సంపదలో వాటా దక్కకుండా అభివృద్ధికి ఆమడదూరం చేసే విధంగా మనువాద్య విధానాలను అవలంభిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.బాల నరసింహ మాట్లాడుతూ అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహాసభలు 2025 జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జరగనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈ మహాసభల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై మూడు రోజుల పాటు సుదీర్ఘంగా చర్చించి దేశవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలను విజయవంతం చేసేందుకు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, అందరూ సహాయసహకారాలు అందించాలని కోరారు.

బీఆర్ఎస్‌కు అధికార కాంక్ష

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ సోనియాగాంధీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి దొరతనంతో తెలంగాణ ఏర్పడిందని, అందులో ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదన్నారు. మరోసారి వారికి నా ధన్యవాదాలు అసెంబ్లీ రికార్డుల్లో అధికారికంగా తెలియజేస్తున్నానని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు కొన్ని దశాబ్దాలుగా పోరాటం జరుగుతుంటే డిసెంబరు 9న యూపీఏ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ ఈ జన్మదినం సందర్భంగా హోం మంత్రి చిదంబరంతో అధికారికంగా ప్రకటన చేయించారని గుర్తు చేశారు. ఇప్పుడు సభ్యులు సభలో ఉండి తెలంగాణ ఏర్పాటుకు కారణమైన సోనియాగాంధీని, ఆమె నిర్ణయాన్ని, తెలంగాణ అమరుల కలలు నిజం చేసిన ఆమె ప్రకటనకు సభ మొత్తం ఏకగ్రీవంగా కృతజ్ఞతలు చెప్పాల్సి ఉందని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలో అద్భుతంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరుగుతుందని, రాష్ట్రం మొత్తం పండుగలా జరుపుకుంటుంటే, బీఆర్ఎస్ నేతలు బయటికి పోవడం ఏ సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రతిపక్షం అభిప్రాయాలు చెబితేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని, పెద్దల సభ శాసన మండలిలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై నేను ప్రకటన చేస్తే సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారని, హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. కేటీఆర్, హరీశ్ రావు సభలో ఉండి అభిప్రాయాలు చెబితే బాగుండేదని, వారు మమ్మల్ని పొగడాలని, తెలంగాణ తల్లి విగ్రహం గొప్పగా ఉందని చెప్పాలని మేము కోరుకోవడం లేదని అన్నారు. భిన్నాభిప్రాయాలు ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో సభను నడిపామని, తెలంగాణ బిల్లు చర్చకు వచ్చినప్పుడు తాను డిప్యూటీ స్పీకర్‌గా, శ్రీధర్ బాబు శాసనసభ వ్యవహారాల మంత్రిగా అందరికీ అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు. ఆనాడు అంతా సభలోనే ఉండి అభిప్రాయాలు చెప్పారని, ఎవరు సభను వదిలి వెళ్లలేదన్నారు. తెలంగాణ తల్లి ఉత్సవాలను డిసెంబరు 9న అధికారికంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు గెజిట్ విడుదల చేసి అధికారిక లాంఛనాలు పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం చూస్తుంటే ఒక అమ్మ, ఒక నాయనమ్మ కనిపిస్తారని, చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తుందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పంటల పచ్చదనానికి ఆకుపచ్చ చీర ప్రతిబింబం, రాజ్య హింస పెరిగినప్పుడు ప్రజలు తిరుగుబాటు చేస్తారనే దానికి పీఠం పైన పిడికిళ్లు, ఎరుపు ప్రగతిశీల భావాలు ఉద్యమాలకు గుర్తు, అదనంలో ఉన్న వారిని ఆదుకుంటూ సుభిక్షంగా ఉండాలని అభయ హస్తంతో ఆశీర్వదిస్తారన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... మీ అందరినీ చూస్తోంటే కృష్ణా, గోదావరి నదులు ఇక్కడ ప్రవహిస్తున్నట్లు ఉందన్నారు. చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయే ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా గత పాలకులు వాహనాలకు టీజీ బదులు టీఎస్ అని నిర్ణయించారని, అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీజీని అధికారికంగా వాహనాలకు ఏర్పాటు చేసేలా అమలులోకి తీసుకొచ్చామన్నారు. ఉద్యమ సమయంలో స్ఫూర్తిని నింపిన జయ జయహే తెలంగాణ గీతాన్ని పదేళ్లుగా రాష్ట్ర గీతంగా ప్రకటించలేదని కానీ ప్రజా ప్రభుత్వంలో ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామని చెప్పారు. రాష్ట్ర పరిపాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలో కవి అందెశ్రీని సన్మానించుకోవడం నాకు జీవితకాలం గుర్తుండే సందర్భంగా పేర్కొన్నారు. డిసెంబర్ 9 ఒక పవిత్రమైన రోజు ఒక పండుగ రోజుగా అభివర్ణించారు. ఈ రోజు మన ఆలోచనలన్నీ అమ్మ చుట్టూనే ఉండాలని ఒక పండుగలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, అవినీతి నుంచి అభివృద్ధి వైపు, తెలంగాణను పునర్నిర్మాణం వైపు తీసుకెళుతున్నామని తెలిపారు. తెలంగాణ కవులు, కళాకారులకు సీఎం రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారు. ఒక వ్యక్తి కోసమో... ఒక కుటుంబం కోసమో తెలంగాణ తెచ్చుకోలేదని అన్నారు. ఉద్యమాన్ని

కవులు, కళాకారులు భుజాన వేసుకొని నడిపించారని కొనియాడారు. తమ ఆట పాటలతో ఉద్యమాన్ని ఉధృతంచేశారన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాన్ని కళ్లకు కట్టినట్లు స్థూపం రూపొందించిన ఎక్కా యాదగిరిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఫోర్త్ సిటీలో ఎక్కా యాదగిరికి 300 గజాల స్థలంతో పాటు రూ.కోటి నగదు అందజేస్తామని కీలక ప్రకటన చేశారు. ఆయనతో పాటు ప్రముఖ కవులు.. గూడ అంజయ్య, గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ సహా మొత్తం తొమ్మిది మంది కవులకు, కళాకారులకు ఫ్యూచర్ సిటీలో 300 గజాల ఇంటి స్థలం, కోటి రూపాయల నగదు అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కొంతమందికి బాధ, ఆవేదన, దుఃఖం ఉండొచ్చని, వాళ్ల రాజకీయ మనుగడ కు ఈ నిర్ణయాలు ప్రమాదకరమని వాళ్లు అనుకోవచ్చన్నారు. కానీ ఒక కుటుంబం కోసమో, ఒక రాజకీయ పార్టీ కోసమో మనం తెలంగాణ సాధించుకోలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అవమానాలు ఎదుర్కొన్నామని, తెలంగాణలో పదేళ్లు నిర్లక్ష్యానికి గురయ్యామని చెప్పారు. ఇక అలాంటి అవమానాలు, నిర్లక్ష్యాలు ఉండకూడదని ప్రతీ ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ వేడుకలు ప్రభుత్వ పరంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండాసురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

సాధనం అయిన ఎంఎస్‌పీ విషయంలో ప్రభుత్వం పదేపదే నిష్క్రియాత్మకంగా వ్యవహరించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని రాజా పేర్కొన్నారు. అసమ్మతి లేకుండా చేసేందుకు పోలీస్ బలగాలను ప్రయోగించడంతో సహా రైతుల శాంతియుత నిరసనలను అణచివేసేందుకు మోదీ సర్కారు అనుసరిస్తున్న ఎత్తుగడలను కూడా సీపీఐ ఖండిస్తోందని రాజా అన్నారు. తమకు రావాల్సినవి తప్ప మరేమీ డిమాండ్ చేయని రైతులను దేశ ద్రోహులుగా పరిగణిస్తూ అన్యాయంగా అరెస్టులు, లాఠీచార్జీలు, హత్యలు కూడా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీసర్కారు నిరంకుశత్వ , రైతు వ్యతిరేక విధానాలను ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై ప్రతిఘటించాలని సీపీఐ పిలుపునిస్తోందన్నారు. అలాగే తక్షణమే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించాలని, ఈ పోరాటంలో సఫలీకృతం చేసేందుకు వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రైతులకు అండగా నిలుస్తుందని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారమయ్యే వరకు వారితో కలిసి పోరాడుతుందని స్పష్టం చేశారు.

న్యాయవ్యవస్థ భారత లౌకిక చట్రాన్ని గౌరవించాలి

దేశంలో లౌకికవాద స్ఫూర్తిపై ఇటీవల జరిగిన దాడిని సీపీఐ అంగీకరించదని రాజా నేరుగా ప్రకటనలో తెలిపారు. మైనారిటీ ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకుని దిగువ కోర్టులు జారీ చేసిన హడావుడిగా సర్వే ఉత్తర్వులే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ చర్యలు ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం (1991) లో పేర్కొన్న అంశాలు, చట్ట స్ఫూర్తిని ఉల్లంఘించడమే కాకుండా మన రాజ్యాంగం హామీ ఇచ్చే లౌకిక స్వరూపాన్ని కూడా ప్రమాదంలో పడేస్తాయని పేర్కొన్నారు. ఆగస్టు 15, 1947న మతపరమైన ప్రదేశాల యథాతథ స్థితిని పరిరక్షించడానికి రూపొందించబడిన ఈ చట్టం దేశంలోని విభిన్న వర్గాల మధ్య శాంతి, సామరస్యాన్ని నిర్ధారించడానికి ఉద్దేశించబడింది. ఇలాంటి సర్వేలను అనుమతించడం ద్వారా న్యాయవ్యవస్థ మతపరమైన ధ్రువీకరణకు తలుపులు తెరుస్తోంది. మన రాజ్యాంగంలోని లౌకిక సూత్రాలను నిర్వీర్యం చేస్తోంది. ఈ నిర్లక్ష్యపు విధానం మన సమాజాన్ని విభజించి, మన బహుళత్వాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదకరమైన ధోరణిని ప్రోత్సహించినందుకు మాజీ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సర్వేలను మోపించిన సుప్రీంకోర్టు పాత్రను కూడా సీపీఐ ప్రశ్నిస్తోంది. ప్రార్థనా స్థలాల చట్టాన్ని మత సహనానికి రక్షణ చర్యగా సమర్థించే బదులు దానిని సవాలుచేసేలా నిర్ణయం... దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఉందని రాజా అన్నారు. న్యాయస్థానం చర్యలు మితవాదుల విభజన ఎజెండాలకు ఊతమందించడమే కాకుండా మెజారిటీ లేదా మైనారిటీతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రార్థనా స్థలాలకు చట్టం అందించే రక్షణ కవచాన్ని కూడా బలహీనపరిచాయన్నారు. మన లౌకిక ప్రమాణాల ముందు ప్రశ్నార్థకం చేసే తిరోగమన చట్టపరమైన యుక్తిలో పాల్గొనడం కంటే, భారతదేశ లౌకిక చట్రాన్ని గౌరవించాలని, ప్రార్థనా స్థలాల చట్ట సమగ్రతను సమర్థించాలని న్యాయవ్యవస్థను కోరుతున్నామన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ఢిల్లీలో కుస్తీ... గల్లీలో దోస్తీలా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగట్టేందుకే నిరసన తెలుపుతామని కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్ దీక్ష చేయకపోయుంటే, డిసెంబరు 9న ప్రకటన రాకపోయుంటే తెలంగాణ శాసనసభ, శాసనమండలి ఉండేదా? అని ప్రశ్నించారు. స్పీకర్ ఆదేశాలు లేకుండా శాసనసభ హక్కులకు కాలరాస్తూ అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, ప్రభుత్వంలోని వ్యక్తుల ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ ఆరోపించారు. ఎమ్మెల్యేలను అరెస్టు చేసి పాశవికంగా తెలంగాణ భవన్‌కు తరలించడాన్ని ఆక్షేపించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ నిరంకుశత్వం, తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ప్లకార్డులతో కలిసి కేటీఆర్ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అదానీతో వ్యాపార లాభాలతో పాటు అనేక రకాల కార్యక్రమాలు చేసిన కాంగ్రెస్ పార్టీ మౌనం వహించిందని... అందుకు కారణం రేవంత్ రెడ్డి ఢిల్లీకి పంపిస్తున్న డబ్బు సంచులేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి అదానీతో చేస్తున్న వ్యాపారాలపై ఆ పార్టీ వైఖరిని స్పష్టం చేయాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. తాజాగా నల్గొండ జిల్లా రామన్నపేటలో వేల ఎకరాలను అదానీకి ధారాదత్తం చేసేందుకు స్థానిక ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అదానీతో రేవంత్ రెడ్డికి ఉన్న అక్రమ సంబంధాన్ని బయటపెడతామని కేటీఆర్ ప్రకటించారు. అరాచకపాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ నిర్బంధాలకు గురిచేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్ని నిర్బంధాలు, దాడులకు పాల్పడినా బీఆర్ఎస్ పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు.

ధన్కర్‌పై అవిశ్వాసం!

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బి) కింద సమర్పించే అవకాశం ఉంది. అంతకుముందు దేశాన్ని అస్థిరపరిచేందుకు బిలియనీర్ పెట్టుబడిదారుడు జార్జ్ సోరోస్‌తో కాంగ్రెస్ అగ్ర నేతలు కుమ్మక్కయ్యారని బీజేపీ ఆరోపించడంతో రాజ్యసభలో గందర గోళం చెలరేగింది. రాజ్యసభ కార్యకలాపాల నిర్వహణ విషయంలో ధన్కర్‌పై అసంతృప్తి పెరగడంతో అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రతిపక్ష నేతలు చెబుతున్నారు. తమ ప్రసంగాల సమయంలో తరచుగా అంతరాయం కలిగించారని, క్లిష్టమైన అంశాలపై తగినంత చర్చ జరగలేదని, వివాదాస్పద చర్చల సమయంలో అధికార పక్షం వైపు మొగ్గు చూపుతున్నారని 'ఇండియా' సభ్యులు ఆరోపించారు.

జమిలి ఎన్నికల బిల్లు !

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతు ఇవ్వడం లేదని, ప్రజాస్వామ్య మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే చెబుతున్నారు. ఇదిలాఉంటే, పార్లమెంటుతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు గతంలోనూ జరిగాయి. 1951 నుంచి 1967 దాకా దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలే జరిగాయి. తర్వాత వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలడంతో మధ్యంతర ఎన్నికలొచ్చి జమిలి మాయమైంది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువులు మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వీటన్నింటినీ రాబోయే సార్వత్రిక ఎన్నికలతో కలపాలంటే... కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువు పెంచడమో...మరికొన్నింటికి తగ్గించడమో చేయాల్సి ఉంటుంది.

రాజకీయం చేస్తే చరిత్ర క్షమించదు

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ ఏకాభిప్రాయానికి వచ్చిందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తాను జైలులో ఏడు రోజుల పాటు దీక్ష చేపట్టానని, 700 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేశానని అన్నారు. సకలజనుల సమ్మె, జయశంకర్, కొండరామ్ లాంటి అనేక మంది త్యాగాలు, అనేక వర్గాలతో కృషి చేశారని ఆయన వివరించారు. సింగరేణి గుర్తింపు సంఘంగా 45 రోజుల పాటు సమ్మెలో పాల్గొన్నామన్నారు. సోనియా గాంధీ భిన్నాభిప్రాయాలతో ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని కూనంనేని తెలిపారు. రాజకీయాలు, భేషజాలను పక్కన పెట్టి, అందరూ ఈ చర్చపై ఉంటేనే తెలంగాణ తల్లి పట్ల గౌరవం ఉన్నట్లు అర్థమవుతుందని సూచించారు. మలిదశ తెలంగాణలో యువత ప్రాణత్యాగాలు చేసిందని, యువ విద్యార్థి నాయకుడు శ్రీకాంత్‌పై 250కి పైగా కేసులు ఉన్నాయన్నారు. మహాత్మా గాంధీ కూడా తాను ఒక్కడినే భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చానని ఎప్పుడూ చెప్పుకోలేద న్నారు. వీరోచితంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని, 4,500 మరణించారని, మఖ్దూం మొయినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి కమ్యూనిస్టు యోధులు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన విషయాన్ని కూనంనేని సాంబశివరావు సభలో వివరించారు. వారి త్యాగాలతోనే హైదరాబాద్ సంస్థానం నుంచి తెలంగాణ విముక్తి చెందిందని, దీనిని ఎప్పుడూ కమ్యూనిస్టు పార్టీ వ్యక్తిగతంగా చెప్పుకోలేదని అన్నారు.

'తెలంగాణ తల్లి'పై వివాదాలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

డిసెంబర్ 9కి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమ సందర్భంలో యువత గుండెలపై రాసుకున్న టీజీ అక్షరాలను వాహనాలకు పెట్టుకున్నామని చెప్పారు. ఉద్యమ కాలంలో స్ఫూర్తిని నింపిన జయ జయహే తెలంగాణ గీతాన్ని మన రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామన్నారు. అయితే ఇప్పటి వరకు అధికారికంగా తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదించుకోపోవడం దురదృష్టకరమని, ఎందుకంటే తెలంగాణ దేవత, తెలంగాణ తల్లి రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చాయన్నారు. వజ్ర వైఢూర్యాలతో, భుజకీర్తులు, కిరీటాలతో ఉంటారా? పల్లెల ఉండేలా అని ప్రస్తావన వచ్చినప్పుడు తల్లి ప్రతిరూపమే ఉండాలని మేధావులు సూచించారన్నారు. తెలంగాణ తల్లిని చూస్తే మన తల్లిని చూసిన స్ఫురణ కలిగేలా బహుజనుల తెలంగాణ తల్లిని ఇవాళ ప్రతిష్ఠించుకోబోతున్నామన్నారు. దురదృష్టవశాత్తు కొంతమందికి ఇది నచ్చలేదని కానీ మొండి యుగాల చక్రవర్తుల పాలనల ఇవాళ నడవదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని వారు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఒక్కరోజు తెలంగాణ సమాజం కోసం సమయం ఇద్దామని, ఇవాళ వివాదాలకు తావు ఇవ్వొద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు జరుపుకుందామన్నారు.

సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ 78వ జన్మదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెకు సభాముఖంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సభ తరఫున, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ఆమెకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో, ఇక్కడ ప్రజలతో సోనియాగాంధీది విడదీయలేని అనుబంధమన్నారు. 60 ఏళ్ల పోరాటాన్ని గౌరవించి, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, మన దశాబ్దాల కలను నిజం చేసిన ప్రజల నాయకురాలు సోనియాగాంధీ అన్నారు.

ఇది విగ్రహం కాదు జాతి ఆత్మగౌరవపతాక: డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై శాసనసభలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు తెలంగాణ జాతి భావనకు జీవం పోసిందన్నారు. స్వేచ్ఛ కోసం పిడికిళ్లు బిగించిన ప్రజల ఉద్యమం, జ్వాల విగ్రహంలో కనిపిస్తాయని చెప్పారు. తెలంగాణ తల్లి అంటే ఒక భావన కాదు నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగమని, మన సాంస్కృతికాలు, సంస్కృతులు, చారిత్రక వేషధారణ పరిగణలోకి తీసుకుని నిండైన రూపాన్ని తీర్చిదిద్దడం జరిగిందన్నారు. చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్క పోరాట స్ఫూర్తితో ఎంతో హుందాతో కూడిన ఆహార్యం తో మన తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించబడిందని పేర్కొన్నారు.

శాసనసభలో హుందాగా మాట్లాడాలి: సీఎం హితబోధ

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు ఎవ్వరు కూడా నోరు జారకుండా సభలో హుందాగా వ్యవహరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ఈనెల 16వ తేదీకి వాయిదా పడిన తర్వాత నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ సమయంలో చాలా పార్టీలు, వ్యక్తులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత తెలంగాణ తల్లిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించలేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. రాజకీయ కోణంలో బీఆర్ఎస్ పార్టీ పనిని విమర్శిస్తోంది కానీ సభ్యులు సభకు రాకపోతే ఎమ్మెల్యేలు గా విఫలం అయినట్లన్నారు. వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం.భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గోపిమూర్తి విజయం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తయింది. ఈ ఎన్నికలో మొత్తం 15,494 ఓట్లు పోలవగా... 814 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 14,680 ఓట్లలో బొర్రా గోపీమూర్తికి 9,165 ఓట్లు తొలి రౌండ్‌లోనే లభించాయి. ఈ ఎన్నికలో పోటీ చేసిన ఇతర అభ్యర్థులు గంధం నారాయణరావుకు 5,259, దీపక్ పులుగుకు 102, నామన వెంకట లక్ష్మి (విళ్ల లక్ష్మి)కి 81, డా.నాగేశ్వరరావు కవలకు 73 ఓట్లు లభించాయి. నిర్దేశించిన కోటా ఓట్ల సంఖ్య 7,341 కాగా... దీనికి మించి బొర్రా గోపీమూర్తికి తొలి రౌండ్‌లోనే 9,165 ఓట్లు లభించడంతో... ఆయన విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. గోపీమూర్తికి ధృవపత్రం అందజేశారు. అనంతరం గోపీమూర్తి మీడియాతో మాట్లాడుతూ తన పట్ల అపార అభిమానం, నమ్మకంతో తనను ఎమ్మెల్సీగా గెలిపించిన ఉపాధ్యాయులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. దేశ ప్రగతిలో విద్యారంగ పాత్ర అత్యంత కీలకమైనదని, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గోపీమూర్తికి వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

పవన్‌ను చంపేస్తాం...

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు పవన్ కళ్యాణ్ తెలియజేశారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడంపై హోంమంత్రి అనిత స్పందించారు. ఈ విషయంపై డీజీపీతో ఆమె మాట్లాడారు. పవన్ పేషీకి రెండుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చినట్లుగా హోంమంత్రి వివరించారు. ప్రజాప్రతినిధులపై బెదిరింపు దిగితే ఉపేక్షించబోమని ఆమె స్పష్టంచేశారు.

రెండో పంటకు నీటిని విడుదల చేయండి : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గంలో చెరువుల కింద ఉన్న ఆయకు రైతులకు వ్యవసాయ పంటలకు నీళ్లు అందించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు తోపాటు పాల్వంచ మండల పరిధిలోని చింతల చెరువు ఆయకట్టు రైతులకు రెండో పంటను సాగు చేసుకునేందుకు నీటిని విడుదల చేయాలన్నారు. నీటి పారుదల శాఖ జిల్లా ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ అర్జున్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆదేశించారు. రెండో పంట సాగుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఖరీఫ్ సీజన్లో సరిగా పంటలు పండక నష్టాల్లో ఉన్న రైతులు లబ్ది జరుగుతుందన్నారు. అధికారులు నీరు అందిస్తారని రైతులు సాగుకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి విడుదల వల్ల ఎలాంటి ఇబ్బందులు, అంతరాయం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

దళిత బంధు పథకం ప్రారంభించాలి : ఎమ్మార్పీఎస్

గార్ల - విశాలాంధ్ర : అంబేద్కర్ చేయూత (దళిత బంధు) పథకం త్వరలో ప్రారంభించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గిన్నారపు మురళీతారక రామారావు కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిందని ఆయన గుర్తు చేశారు. అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి పథకం వర్తింపచేయాలనీ డిమాండ్ చేస్తూ సోమవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నప్పటికి ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. రాజకీయ జోక్యం లేకుండా నిజమైన లబ్దిదారులను గుర్తించి పథకాన్ని అందిస్తే దళిత కుటుంబాలు ఆర్థికంగా బాగుపడతాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కొత్తపల్లి వెంకన్న, ఎడ్ల రాజేందర్, మురళీకృష్ణ, రామకృష్ణ, విశ్వనాథం, మైసయ్య, నాగరాజు, కృష్ణ, నవ్యశ్రీ, లక్ష్మి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మినీ మేడారం జాతర పనుల్లో అలసత్వం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : తాడ్వాయి మండలంలోని మినీ మేడారం శ్రీ సమ్మక్క, సారక్క జాతర సమయం సమీస్తున్న, సందర్భంగా మేడారంలోని సిసి రోడ్లు మరమ్మతు పనులు, పారిశుద్ధ్య పనులు ప్రభుత్వం చేపట్టడం లేదని, మేడారం శ్రీ సమ్మక్క సారక్క జాతర పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ద బోయిన జగ్గారావు తెలిపారు. సోమవారం ములుగుజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవరణలో జగ్గారావు మాట్లాడుతూ మినీ మేడారం జాతర 2025, ఫిబ్రవరి నెల 12 నుండి 15 వరకు జరుగుతుందని, ఇప్పటికే మేడారంకు, వన దేవతలను, భక్తులు దర్శంచుకుంటున్నారన్నారు. మినీ మేడారం సమయం దగ్గర పడుతుండడంతో వెంటనే మేడారంలో పారిశుధ్య, సిసి రోడ్ల మరమ్మత్తు పనులు, డబల్ (వేడల్పు) రోడ్ల పనులు ప్రారంభించాలని, అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. మినీ మేడారం జాతరకు ఇతర రాష్టాల నుండి, ఉమ్మడి రాష్ట్రం నుండి వేలాది మంది భక్తులు వస్తారని, సౌకర్యాలు కల్పించాలని అయన తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు బెంచీల వితరణ

విశాలాంధ్ర - ఖమ్మం : స్థానిక జలగం నగర్‌లోని రెసిడెన్షియల్ పాఠశాల (బాలురు)కు జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సోమవారం మరమ్మత్తులు నిర్వహించిన 70 బెంచిలను వితరణ చేశారు. ఇటీవల మున్నేరుకు వచ్చిన వరద వల్ల పాఠశాలలో సామాగ్రి పూర్తిగా దెబ్బతింది. వరదలతో విద్యార్థులు కూర్చునే బెంచిలు కూడా దెబ్బతిన్నాయి. కాగా, పాఠశాలకు సందర్శనకు వచ్చి, పరిస్థితులను పరిశీలించిన జమాతే ఇస్లామి హింద్ నాయకులు బెంచిలు దెబ్బతినడంతో విద్యార్థులు నేలపైనే కూర్చుని ఉండటం, అలాగే పాఠాలు వింటుండటం గమనించారు. దీనితో చలించిన జమాతే ఇస్లామీ హింద్ నాయకులు మరమ్మతులకు హామీ ఇచ్చారు. 16 వేల రూపాయల వ్యయంతో 70 బెంచిలకూ మరమ్మత్తులు తలపెట్టి, పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమీ, ఖిల్లా అధ్యక్షులు అబ్దుల్ మలిక్, వార్డెన్ మహమ్మద్ రఫీ, ఆఫీస్ సబార్డినేట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. విద్య, వైద్యం, ధరణి, పింఛన్లు, రెవెన్యూ, వ్యవసాయం తదితర సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సుదీర్ఘ పోరాటం వల్లే తెలంగాణ ప్రకటన

విశాలాంధ్ర - వనపర్తి : కెసిఆర్ సుదీర్ఘ పోరాటం 11 రోజుల ఆమరణ దీక్ష వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రకటన డిసెంబర్ 9న వెలువడిందని ఎవరి దయాధాక్షిణ్యాల వల్ల రాలేదని కె.సి.ఆర్ పోరాట అర్హత, దక్షత వల్లనే రాష్ట్ర ప్రకటన వెలువడిన రోజు కాబట్టి విజయ దివాస్ జరుపుకుంటున్నామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. దీక్షా దివాస్ రోజు సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గోపాల్‌పేట మండల కేంద్రంలో తెలం గాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంత్, అమరవీరులు పోలీస్ కిష్టయ్య, యాదయ్య, సువర్ణ నివాళులర్పించారు. కె.సి.ఆర్ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంతో రాష్ట్రాన్ని సాధించి అధికారం చేపట్టి తెలంగాణను బంగారు తెలంగాణ దిశగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం చేపట్టి అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెట్టారన్నారు. గోపాల్ పేట మండల కేంద్రంలో నూతనంగా ఆవిష్కరించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతిరావు పూలే, జగ్జీవన్ రామ్ గార్లకు నివాళులు అర్పించారు. వనపర్తి, గోపాల్ పేట పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - బ్యూరో ఖమ్మం : ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్, కొణిజర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 19 వేల మంది రైతుల నుంచి లక్షా 19 వేల 952 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, లక్షా 18 వేల 220 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు తరలించామని అన్నారు. జిల్లాలో మొత్తం 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేందుకు గోడౌన్ స్థలం అందుబాటులో ఉందని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర క్రింద మొత్తం 278 కోట్ల 29 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికి 181 కోట్లు 83 లక్షలు చెల్లించడం జరిగిందని అన్నారు. సన్న రకం పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించిందని, ఖమ్మం జిల్లాలో సన్న రకం వడ్లు పండించిన 12 వేల 441 మంది రైతులకు బోనస్ క్రింద ఇప్పటి వరకు 38 కోట్ల 84 లక్షలు జమ చేశామని అదనపు కలెక్టర్ అన్నారు. ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హామాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో రైతులకు అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఇల్లందు : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ జయంతి వేడుకలను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు జై సోనిఅమ్మ నినాదాల మధ్య కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు ఆధ్వర్యంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు గడిపల్లి స్వరూప అధ్యక్షన సోనియా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 60 ఏళ్ల ప్రత్యేక తెలంగాణ స్వప్నాన్ని సహకారం చేసి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారని ఈ సందర్భంగా నాయకులు వెల్లడించారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రయోజన పాలన చేస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ నందు రోగులకు గర్భిణీ స్త్రీలకు పాలు, పళ్ళు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాలలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎదలపల్లి అనసూయ, కాంగ్రెస్ నాయకులు ప్రధాన కార్యదర్శి జాఫర్, మడుగు సాంబమూర్తి, బొల్లా సూర్యం, చిల్లా శ్రీను, గుడివాడ వీరభద్రం, సుదర్శన్ కోరి, ఐఎన్టీయూసీ నాయకులు మహబూబ్, మహిళా నాయకురాళ్లు గాలిపల్లి స్వరూప, చెంచమ్మ, పాయం స్వాతి, పద్మ, నిర్మల, సరస్వతి, చిల్లా భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులకు కోయ కులం సర్టిఫికెట్ ఇవ్వాలని ధర్నా

విశాలాంధ్ర - చర్ల : హైకోర్టు తీర్పును అనుసరించి వలస ఆదివాసీలకు కోయ కులం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ చర్ల మండలంలో ఉన్న అనేక వలస ఆదివాసుల గ్రామాలున్నా యని వివరించారు. అనివార్య పరిస్థితుల వల్ల వలస వచ్చి దశాబ్దాల నుంచి ఇక్కడే బతుకుతున్నారని తెలిపారు. హైకోర్టు చాలా స్పష్టంగా వలస ఆదివాసులకు కోయ కులం కింద పరిగణించాలని తన తీర్పులొ స్పష్టం చేసినట్లు తెలిపారు. హైకోర్టు తీర్పును కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలస ఆదివాసులపై చాలా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఈ తెగ విద్యార్థులు పై చదువులకు పోవాలంటే కులం సర్టిఫికెట్ అనివార్యంగా మారిందన్నారు. సర్టిఫికెట్లు మంజూరు చేయకపోవడంతో ఈ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. ధర్నా అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందించారు. పై అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్టు చెప్పారు. ధర్నాలో సంఘం నేత కారం నరేష్, బాధిత ఆదివాసి కుటుంబాలు పాల్గొన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మాజీ జెడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, గంధం సురేష్, కోట్ల జగదీష్, కైసర్ ఖాన్, యువజన సంఘం అధ్యక్షుడు మంగ్య నాయక్, గడ్డం శ్రీరాములు, రవి, బక్కలయ్య, వెంకటయ్య బంజారా సంఘం నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మెదక్‌లో: మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేశారు. మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్ మాట్లాడుతూ సోనియాగాంధీ వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. నాయకులు మేడి మధుసూదన్ రావ్, ముత్యం గౌడ్, అవారి శేఖర్, లక్ష్మీనారాయణ గౌడ్, బొజ్జ పవన్, దాయర రవి, మంగ మోహన్ గౌడ్, జ్యోతి క్రిష్ణ, హరిత, స్వరూప, నాగరాజు, ప్రభాకర్, పోచేందర్, ముజాహిర్, రాజలింగం, మంగ రమేశ్ గౌడ్, దేవులా, మహ్మద్ సూఫి, గాడి రమేశ్, మంగ రవి, ముజీబ్, సలీం, సుదర్శన్, ప్రవీణ్, హమీద్, శ్రావణ్, ప్రభాకర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూరులో: సోనియా గాంధీ అంకితభావం గల నాయకురాలని, ప్రధాని పదవిని సైతం త్యాగం చేసిన చరిత్ర ఆమెదేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్‌లు కొనియాడారు. ఏఐసీసీ అగ్రనేత, సోనియా గాంధీ జన్మదిన వేడుకలు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంతోపాటు గాంధీ సెంటర్‌లో సోమవారం మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్తె అమూల్య పుట్టినరోజు కావడంతో ఆ చిన్నారి చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ కల సాకారం కావడానికి సోనియా గాంధీ కారణమని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల బాటలోనే దేశంలో కాంగ్రెస్ పార్టీని ప్రభల శక్తిగా మార్చడంలో సోనియా గాంధీ పాత్ర కీలకమన్నారు.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నేడు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాబోయే జనవరి నెలలో 9, 10 వ తేదీలలో జరిగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం సిటీ భద్రాచలంలోని శ్రీ సీతారామాస్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు కల్పించవలసిన వసతి, సౌకర్యాల ఏర్పాట్ల గురించి ఈ ముందస్తు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందుకే మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తులు వస్తారని కలెక్టర్ తెలిపారు. ఆ భక్తులకు అనుగుణంగా కల్పించవలసిన వసతి సౌకర్యాలపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ముస్లింల ఖబరాస్తాన్‌లో స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయండి : ఫహీమ్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రామవరంలోని ఖబరస్తాన్, ఈద్గాల లో స్థంబాలు, లైట్లు ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు కబరిస్తాన్ కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ఫహీమ్ దాదా మాట్లాడుతూ చనిపోయిన వారికి సాయంత్రం వేళలో ఖనన కార్యక్రమాలు నిర్వహించాలంటే చీకటి వల్ల చాలా ఇబ్బందిగా ఉందన్నారు. సెల్ఫోన్ టార్చ్‌లతో, మోటర్ సైకిల్ బండ్ల లైట్లతో కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. సమస్య పరిష్కారానికి కేవలం 25 పోల్స్ 50 లైట్స్ ఏర్పాటుచేస్తే సరిపోతుందని ఫహీమ్ కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఈ కమిటీ నాయకులు రసూల్ పాషా, షమియెద్దిన్, ఖయ్యూం, గౌస్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం నగరంలోని వాణి ఐటీఐ కాలేజ్ సమీపంలో ఖమ్మం మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. మామిళ్లగూడెంకు చెందిన లక్ష్మీ నక్షత్ర(14) గా రైల్వే పోలీసులు గుర్తించారు. లక్ష్మీ నక్షత్ర స్థానిక హార్వెస్ట్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నట్లు తెలిసింది. ఆమె తండ్రి మెడికల్ రిప్రజెంటివ్గా పనిచేస్తున్నట్టు సమాచారం. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు బృందం రైలు పట్టాల మీద నుంచి బయటికి తీశారు.

సింగరేణిలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి సాధన

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి : సింగరేణిలో ఏప్రిల్ నుండి డిసెంబర్ 8 వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ తెలిపారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ జీఎం కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వివిధ డివిజన్లలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 45.45 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా 41.83 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఇది 92 శాతం ఉత్పత్తి సాధన అని ఆయన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఈనెల 23న ఆవిర్భావ దినోత్సవం జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఘనంగా జరుపుతామని,ఇందులో సింగరేణి కుటుంబ సభ్యులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముందుగానే గృహ శోభ పోటీలు,దీపాలంకరణ పోటీలు,ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో అధికారులు గోపాల్ సింగు, కిరణ్ బాబు, ఆంజనేయులు, ధన లక్ష్మి బాయి, హన్మంతరావు, రాజన్న, ఏఐసీసీ నాయకులు పోషం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి. అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్‌రావు, ఆర్డీఓ వెంకటేష్‌లతో కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సిపిఓ ప్రకాష్, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సి కార్పొరేషన్ ఈడి తుల రవి, డిసిఎస్ఓషా ఫైజల్ హుస్సేనీ, డిఎం డిసిఎస్ఓ రాం పతి, ఏటిడిఓ దేశిరాం, డిడబ్లుఓ ఇంచార్జీ శిరీష, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 11 నుండి ఐక్యూ13 విక్రయాలు

హైదరాబాద్: అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13 విడుదలతో పరిశ్రమ ప్రమాణాలను పునర్నిర్వచిస్తోంది. ఫ్లాగ్‌షిప్ డివైజ్ సాటిలేని పనితీరు, అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్‌ను మిళితం చేస్తుంది. ఐక్యూ13 12జీబీ ర్యామ్+256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.54,999 (ప్రభావం: రూ.51,999), 16జీబీ ర్యామ్+512 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.59,999గా ఉంది. లెజెండ్, నార్డో గ్రే అనే రెండు రంగుల్లో ఇది లభిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్/డెబిట్ కార్డులపై రూ.3,000 ఫ్లాట్ డిస్కౌంట్‌తో పాటు లాంచ్ ఆఫర్లను కస్టమర్లు పొందవచ్చు. నాన్ వివో/ఐక్యూ డివైజ్‌లకు రూ.3,000, వివో/ఐక్యూ డివైజ్‌లకు రూ.5,000 ఎక్స్ఛేంజ్ బోనస్ లభిస్తుంది. అదనంగా, 9 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఐక్యూ13, వివో ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లు, ఐక్యూ ఇ-స్టోర్, అమెజాన్.ఇన్‌లో అందుబాటులో ఉంటుంది. వివో ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌లు, ఇతర మెయిన్‌లైన్ స్టోర్‌లలో దాని లభ్యతతో, ఈ విస్తరణ ఐక్యూ పరికరాలను ప్రత్యక్షంగా అనుభవించే, కొనుగోలు చేసే సౌలభ్యాన్ని నిర్ధారిస్తుంది.

వివో 'స్విచ్‌ఆఫ్' క్యాంపెయిన్ 6వ ఎడిషన్ పరిచయం

ముంబయి: మానవ సంబంధాలపై స్మార్ట్‌ఫోన్ల ప్రభావం నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం బుద్ధిపూర్వక వినియోగాన్ని ప్రోత్సహించే ప్రయత్నాన్ని కొనసాగిస్తూ, వివో ఇండియా 'స్విచ్ ఆఫ్' క్యాంపెయిన్ 6వ ఎడిషన్‌ను సగర్వంగా పరిచయం చేస్తోంది. కుటుంబాలు తమ స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, నాణ్యమైన, అర్థవంతమైన క్షణాల ఆనందాన్ని తిరిగి కనుగొనాలని కోరింది. వివో-సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) అధ్యయనం 'తల్లిదండ్రులు-పిల్లల సంబంధాలపై స్మార్ట్‌ఫోన్ల ప్రభావం 2024' 6వ ఎడిషన్ విడుదలతో ఈ ప్రచారం ప్రారంభమైంది. ప్రతి 10 మంది పిల్లల్లో 8 మంది తల్లిదండ్రుల 'స్మార్ట్ ఫోన్ వాడకం' కోసం 'పేరెంటల్ కంట్రోల్స్' కోసం కాల్ చేస్తున్నారని అధ్యయనం వెల్లడించింది. 69 శాతం మంది పిల్లలు మితిమీరిన స్మార్ట్ ఫోన్ వాడకాన్ని తమకు, తమ తల్లిదండ్రులకు మధ్య సంఘర్షణకు కారణమని సర్వేలో తేలింది. ముఖ్యంగా, 86% మంది తల్లిదండ్రులు అధిక స్మార్ట్ఫోన్ వాడకం తమ పిల్లలతో అర్థవంతంగా నిమగ్నం కావడానికి అనుమతించదని భావిస్తున్నారని అధ్యయనం వెల్లడించింది.

కర్నాటకలో 'టయోటా యూత్ కనెక్ట్' కార్యక్రమం ప్రారంభం

బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం), భారతదేశ భవిష్యత్తు శ్రామికశక్తిని రూపొందించడంలో తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, కర్ణాటకలోని మొత్తం 30 జిల్లాల్లో మూడు వారాల పాటు నిర్వహించే "టయోటా యూత్ కనెక్ట్" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. అకాడెమియా, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి రూపొందింది. ఈ కార్యక్రమం విద్యార్థులను ఆటోమొబైల్ పరిశ్రమ డైనమిక్ ప్రపంచానికి పరిచయం చేసింది. వృత్తికి సిద్ధంగా ఉన్న వర్క్‌ఫోర్స్‌ను నిర్మించడంలో నైపుణ్యం అభివృద్ధి మరియు అప్రెంటిస్‌షిప్ అవకాశాల యొక్క కీలక పాత్రను నొక్కి చెప్పింది. 7,700 మంది యువతను చేరుకోవడం, 70 కంటే ఎక్కువ పారిశ్రామిక శిక్షణా సంస్థలతో సహకరించడం, పరిశ్రమ-నిర్దిష్ట నైపుణ్యాల ప్రాముఖ్యత, అందుబాటులో ఉన్న అవకాశాల విస్తృతి, వృత్తిపరమైన కార్యాలయ సంస్కృతులకు అనుగుణంగా ఉండటం ప్రాముఖ్యతపై చొరవ పాల్గొనేవారికి అవగాహన కల్పించింది. ఇటువంటి ప్రభావవంతమైన కార్యక్రమాల ద్వారా, టొయోటా కర్ణాటక నైపుణ్య పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, 'స్కిల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా' వంటి జాతీయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం కొనసాగిస్తోంది.

ఎపిక్స్ ప్రోగ్రామ్‌తో సామాజిక పరివర్తనకు కెఎల్‌హెచ్ విద్యార్థుల కృషి

హైదరాబాద్: కెఎల్‌హెచ్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ, తమ వినూత్న ఎపిక్స్ (ఈపీఐసీఎస్-కమ్యూనిటీ సర్వీస్‌లో ఇంజనీరింగ్ ప్రాజెక్టులు) కార్యక్రమం ద్వారా సామాజిక ప్రభావంతో విద్యాభాసాన్ని సజావుగా మిళితం చేయడం ద్వారా విద్యలో సరికొత్త ఆవిష్కరణలను చేస్తోంది. అజీజ్ నగర్ క్యాంపస్‌లో ఇటీవల నిర్వహించిన కెఎల్‌హెచ్ స్టూడెంట్స్ ఎపిక్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, సాంకేతికత, సామాజిక ఆవిష్కరణల స్ఫూర్తిదాయక కలయికను ప్రదర్శించింది. విద్యార్థుల నేతృత్వంలోని కార్యక్రమాలు అర్థవంతమైన మార్పును ఎలా నడిపిస్తున్నాయి, సమాజ అభివృద్ధి సరిహద్దులను ఎలా పునర్నిర్వచిస్తున్నాయనేది ఇది ప్రదర్శించింది. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల నుండి 130 మల్టీడిసిప్లినరీ విద్యార్థి బృందాలతో, కెఎల్‌హెచ్ సాంప్రదాయ విద్యా నమూనాలను, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి డైనమిక్ ప్లాట్‌ఫారమ్‌లుగా మార్చింది. నాగిరెడ్డిగూడ, రెడ్డిపల్లి, బాకారం జాగీర్, కుతుబుద్దీన్ గూడ, పెదమంగళారం, అప్పోజిగూడ అనే ఆరు స్థానిక గ్రామాలను వ్యూహాత్మకంగా దత్తత తీసుకున్నారు. ఈ ప్రయత్నం కమ్యూనిటీ అభివృద్ధిని ప్రోత్సహించడానికి వాగ్దానం చేసే సాంకేతిక జోక్యాలకు ప్రత్యక్ష మార్గాన్ని సృష్టించింది.

వికాస్ లైఫ్‌కేర్ రాజస్థాన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్కీమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాజస్థాన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్కీమ్ ఇండస్ట్రియల్ ఏరియాలో కొత్త, అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వికాస్ లైఫ్‌కేర్ లిమిటెడ్ ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2024లో కార్యకలాపాలను ప్రారంభించేందుకు షెడ్యూల్ చేయబడిందన్నారు. ఈ సదుపాయం థర్మోప్లాస్టిక్ రబ్బర్, థర్మోప్లాస్టిక్ ఎలాస్టోమర్‌తో సహా అధునాతన వస్తువుల సమ్మేళనాలను తయారు చేయడంలో ప్రత్యేకతను కలిగి ఉంటుందన్నారు. అదనపు ప్రయోజనాలలో ఉపాధి కల్పనకు అనుసంధానించబడిన సబ్సిడీలు, విద్యుత్ సుంకం, భూమి పన్ను వంటి సుంకాలపై మినహాయింపులు లేదా వాయిదాలు, సంభావ్య మూలధన పెట్టుబడి, వడ్డీ రాయితీలు ఉన్నాయన్నారు. 5,000 ఏమ్ పిటిఏ ఉత్పత్తి సామర్థ్యంతో, ఈ సదుపాయం 400-500 మిలియన్ల అదనపు వార్షిక ఆదాయాన్ని ఆర్జించగలదని అంచనా వేయబడిందన్నారు.

ఎరయా లైఫ్‌స్పేసెస్ ఎబిక్సక్యాష్ ప్రతిష్టాత్మక ఒప్పందాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎరయా లైఫ్‌స్పేసెస్ లిమిటెడ్ కంపెనీ తన అనుబంధ సంస్థ, ఎబిక్సక్యాష్, కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కోసం సమగ్ర టికెటింగ్ సొల్యూషన్‌ను విజయవంతంగా ప్రారంభించినట్లు ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సమగ్ర టికెటింగ్ సొల్యూషన్‌లో భాగంగా స్మార్ట్ ఎలక్ట్రానిక్ టికెటింగ్ మెషీన్‌ల సరఫరా, కమీషన్ నిర్వహణ కోసం ఈబిక్స్ క్యాష్ రవాణా విభాగాన్ని టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్‌గా ఎంపిక చేసిందన్నారు. ఈ ఐదేళ్ల కాంట్రాక్ట్, దాదాపు 335 మిలియన్ల విలువతో, అన్ని ప్రభుత్వ బస్సులను కవర్ చేస్తుందన్నారు. 84 డిపోలలో 10,000కు పైగా పరికరాలు అమర్చబడతాయన్నారు. ఇవి 8,000 బస్సుల ఫ్లీట్‌కు సేవలు అందిస్తాయన్నారు. రాబోయే ఐదేళ్లలో 15,000 పరికరాలకు విస్తరించే యోచనలో ఉందన్నారు. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫారమ్ నగదు, యూపీఐ, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు ఎన్‌సిఎంసి స్మార్ట్‌కార్డులతో సహా వివిధ చెల్లింపు పద్ధతుల ద్వారా టిక్కెట్ విక్రయాలను అనుమతిస్తుందన్నారు. ఈ పరిష్కారాన్ని భారతదేశం అంతటా 50కి పైగా ప్రభుత్వ బస్సు ప్రజా రవాణా యూనిట్లు అనుసరించే అవకాశం ఉందనారు.

ఏసీబీకి చిక్కిన ఖమ్మం ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్



విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం కొత్త కలెక్టరేట్లో ఉన్న ట్రెజరీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నగేష్ 40,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఒక పెన్షనర్‌కి సంబంధించిన నాలుగు లక్షల రూపాయలు ట్రెజరరీ ద్వారా మంజూరు కావాల్సి ఉండగా ఆ డబ్బు కోసం పెన్షనర్ పదేపదే ట్రెజరరీ చుట్టూ తిరగాల్సి వచ్చింది. ట్రెజరరీలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ 40 వేల రూపాయలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సదరు పెన్షనర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో 40 వేలు లంచంగా తీసుకుంటున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు అతనిని పట్టుకొని అరెస్టు చేశారు.

సంపాదకీయం

ఉద్యోగాల కల్పనపై కాకి లెక్కలు

"ప్రతి చేతికి పని ఉంటుంది" అని 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో అప్పటికి ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. అంటే తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్య ఉండదు అని మోదీ అన్నారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చినప్పుడూ ఇదే మాట చెప్పారు. కానీ ఆ రెండు హామీలూ నెరవేరలేదని తేలిపోయింది. అధికారంలోకి రాక ముందు మోదీ "ప్రతి చేతికి పని ఉంటుంది" అన్నారంటే నిరుద్యోగ సమస్యను దూరం చేస్తామనే. మోదీ అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా ఈ హామీ అమలు కానే లేదు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ప్రతి చేతికి అన్న హామీని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అని మార్చేశారు. గత అయిదో తేదీన కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల మంత్రి శోభా కరన్లజే రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖిత రూపంలో ఇచ్చిన సమాధానంలో పెరిగిన ఉద్యోగాల గురించి వెల్లడించిన సమాచారానికి వాస్తవ పరిస్థితికి ఎక్కడా పొంతన కుదరడం లేదు. కోట్లాది ఉద్యోగాలు కల్పించినట్టు వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు ముందు విస్తృతంగా అంకెలు గుప్పిస్తాయి. నిరుద్యోగం తగ్గుతోందని ప్రచారం చేస్తాయి. అవే లెక్కలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉల్లేఖిస్తుంటారు. ఉద్యోగ కల్పన గురించి ప్రభుత్వ ప్రచారం ఎంత భీకరంగా ఉంటుందంటే నిరుద్యోగుల ఆర్తనాదాలు చాలా పీలగా మాత్రమే వినిపిస్తాయి. పని చేసే వారి సంఖ్య పెరిగిందని, నిరుద్యోగం తగ్గిందని ప్రభుత్వం ప్రచారం చేస్తూ ఉంటుంది. అంతేకాక నైపుణ్యం గల ఉద్యోగాలు పెరిగాయని కూడా ఊదరగొడ్తుంది. రాజ్యసభలో మంత్రి చెప్పిన లెక్కలు ప్రతి ఏటా కార్మిక శక్తి సర్వే నివేదికల ఆధారంగా వెల్లడించలేదు. ఇందులో కార్పొరేట్ సంస్థలు కాని సంస్థల వార్షిక సర్వేల లెక్కలూ ఉంటాయి. పెట్టుబడి, కార్మికులు, ఇంధనం, ముడిసరుకులు, సేవలకు సంబంధించి రిజర్వు బ్యాంకు ఇచ్చే వివరాలు సైతం నిరుద్యోగం తగ్గుతోందని ప్రచారం చేయడానికి ఉపయోగించుకుంటారు. ఈ లెక్కలు అనుమానాస్పదమైనవని ఎప్పుడో తేలిపోయింది. అనేకమంది విశ్లేషకులు ఈ లెక్కలను తప్పుపట్టారు. 2024-25 బడ్జెట్‌లోని లెక్కలు ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదించిన అయిదేళ్ల కాలంలో అమలయ్యే అయిదు పథకాల ఊసు ఉంది. ఈ పథకాల ప్రకారం ఉద్యోగ కల్పనకు వెసులుబాటు కల్పించడం, నైపుణ్యం సాధించేందుకు తోడ్పడడం లాంటివి ఉంటాయి. దీనివల్ల అయిదేళ్ల కాలంలో 4.1 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. ఈ లెక్కలు చూసినా మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ నెరవేరడానికి ఉపకరించవు. మోదీ ప్రవేశ పెట్టిన ఉద్యోగ కల్పనా పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తుందని చెప్పారు. కానీ ఈ పథకం ఏ మేరకు అమలవుతోందో గణాంకాలు సిద్ధం చేసే కేంద్ర వ్యవస్థలూ చెప్పవు. రిజర్వు బ్యాంకూ మాట్లాడదు. ఫిబ్రవరి ఒకటిన 2025-26 బడ్జెట్ ప్రతిపాదించాల్సి ఉన్నప్పటికీ అసలు లెక్కలు మాత్రం ఊహకైనా అందవు. ప్రభుత్వ ప్రచార యంత్రాంగం దృష్టంతా ఎప్పుడూ ప్రధానమంత్రి పరువు కాపాడడం మీదే ఉంటుంది. దానికి అనువుగానే లెక్కలు చూపుతారు. మోదీ హయాంలో ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పడానికి తగిన గణాంకాలు గుప్పిస్తారు. ఇవేవీ వాస్తవ పరిస్థితులతో పొంతన కుదిరేవి కావు.

రాజ్యసభలో మంత్రి వెల్లడించిన గణాంకాలు రిజర్వు బ్యాంకు 2023-24 కోసం తయారు చేసిన గణాంకాల మీద ఆధారపడ్డవే. దీని ప్రకారం 2023-24లో దేశంలో ఉద్యోగ కల్పన 64.33 కోట్లకు చేరిందట. ఇది 2014-15లో 47.15 కోట్లు ఉండేదట. అంటే 2014-15 నుంచి 2023-24 మధ్య 17.18 కోట్ల మందికి ఉద్యోగాలు దక్కాయని ప్రభుత్వం వాదిస్తోంది. రిజర్వు బ్యాంకు అంచనాల ఆధారంగానే మంత్రి సమాచారం ఇచ్చారట. రిజర్వు బ్యాంకు సమాచారం జులై 8న విడుదలైంది. ఈ అంకెల మీద బోలెడు అనుమానాలు వ్యక్తం అయినాయి. 2014-15లో 471.46 మిలియన్ల మందికి ఉపాధి ఉండేది. అది 2015-16లో 472.04 మిలియన్లకు పెరిగింది. 2016-17లో పెద్ద నోట్ల రద్దు పుణ్యమా అని లక్షలాది మధ్య, చిన్న తరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఇ.)లు లక్షల సంఖ్యలో మూత పడ్డాయి. మిగిలిన వాటి పని 75 శాతం దాకా తగ్గింది. ఎన్.ఎస్.ఎస్.ఓ. 2017-18లో విడుదల చేసిన గణాంకాల ప్రకారం నిరుద్యోగం 6.1 శాతం ఉంది. ఇది అంతకు ముందు 45 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేనిది. రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం ఉద్యోగ కల్పన 1.8 శాతం పెరిగింది. 475 మిలియన్ల మంది ఉద్యోగాల్లో ఉన్నారు. 2017-18లో నిరుద్యోగం 45 ఏళ్లలో ఎప్పుడూ లేదన్న సమాచారాన్ని ప్రభుత్వం కప్పి పుచ్చింది. జాతీయ గణాంకాల శాఖ సిద్ధం చేసిన ఈ సమాచారాన్నీ ప్రభుత్వం తొక్కి పెడ్తున్నందుకు నిరసనగా ఆ సంస్థకు చెందిన అనేక మంది ఉన్నత స్థాయి ఉద్యోగులు రాజీనామా చేశారు. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని 2019 ఎన్నికల తరవాత విడుదల చేసింది. కేంద్రం అప్పుడే గణాంకాల సేకరణ విధానాన్ని మార్చేసింది. మధ్యమధ్యలో కార్మిక శక్తికి సంబంధించిన సర్వే (పి.ఎ.ఎఫ్.ఎస్.) గణాంకాల ప్రకారం 2023-24లో 19.4 శాతం మందిని ఉద్యోగాల్లో ఉన్న వారిగా జమ కట్టారు. కానీ వీరు ఎలాంటి సాంఘిక సంక్షేమ పథకాలు వర్తించని ఇంటినుంచి నడిపే సంస్థల్లో పని చేస్తున్నవారే. ఇంకా విచిత్రం ఏమిటంటే వారానికి ఒక గంట పని దొరికిన వారిని కూడా ఉపాధి ఉన్న వారిగా ఖాతాలో వేసేశారు. అసలు వేతనాలే లేకుండా పని చేసిన వారూ ఉన్నారు. అందులో ఏదో ఒక పనిచేసుకుని బతుకీడుస్తున్న వారినీ చేర్చారు. ప్రభుత్వం చూపిన లెక్కల్లో ఇలాంటి వారే 39 శాతం మంది ఉన్నారు. ఇలాంటి వారికి వేతనాలు నామమాత్రం. అంటే వీరు మరోరకంగా నిరుద్యోగులే. ఉద్యోగాల కోసం వెతికి విసిగి వేసారి పోయి ఉద్యోగాన్వేషణ మానేసిన వారూ కోట్లాది మంది ఉంటారు. ఇలాంటి అడ్డదిడ్డమైన వాదన చేసి ఉద్యోగ కల్పన పెరిగిపోయిందని మోదీ ప్రభుత్వం టముకు వేస్తూ ఉంటుంది. నికరమైన వేతనాలు అందే ఉద్యోగాలు, నెలసరి జీతాలు వచ్చే ఉద్యోగాలూ గణనీయంగా తగ్గిపోయాయి. రోజు కూలీలకు సైతం పని దొరకడం 2023-24లో 19 శాతానికి తగ్గి పోయింది. ఉద్యోగ కల్పనలో ఘోరంగా విఫలమైన మోదీ ప్రభుత్వం స్థూల జాతీయోత్పత్తి భయంకరంగా తగ్గిపోయిన అంశం గురించి మాత్రం మాట్లాడదు.

తగ్గేదేలే!

చింతపట్ల సుదర్శన్

చీకటిపడితే చాలు చలి కత్తిలా కోస్తున్నది, మనకేమన్నా కప్పుకోడానికి బ్లాంకెట్లా, వేసుకోడానికి మంకీ క్యాపులా గోడకు ఒత్తుకుని మూటలా ఒళ్లు చుట్టుకుని, దవడలు కంట్రోలులో పెట్టుకుని పడుకోవలసిందే కదా అనుకుంటూ అరుగు ఎక్కింది డాగీ. అప్పటికే అరుగు ఎక్కిన గాడిద 'కుయ్యో్య్ మొర్రోవ్' అంటున్నది. గాడిద, గాడిదలా ఓండ్ర పెట్టక మనిషిలా కుయ్యో్య్, మొర్రోవ్ అని మొత్తుకుంటున్నదేమిటి అనుకుంది డాగీ, ఆ మాటే అడిగింది డాగీ.

మనిషి భాష వొచ్చి చచ్చింది కదా, ఒక్కోసారి గాడిదననే విషయం మరిచిపోతున్నాను మరి అంది మూలుగుతూ డాంకీ. సరే సరే ఓండ్ర పెట్టినా, వెక్కి వెక్కి ఏడ్చినా ఏడుపు ఏడుపే కానీ అసలు ఎందుకా ఏడుపని. ఫుడ్డు దొరకలేదా, దొరికింది కడుపు నిండలేదా, దొరికింది ఎక్కువై కడుపునొప్పి మొదలైందా అసలు నీ ఏడుపుకి కారణం ఏమిటో చెప్పి ఏడువు? అంది డాగీ. పబ్లిక్ సర్వీసు కమిషన్ ఇంటర్వ్యూల్లో కురిపించినట్టు కురిపించావు క్వశ్చన్స్, సరిసరి అడిగేవాడికి చెప్పేవాడె ప్పుడూ లోకువే కద. చెప్తా విను. ఫుడ్డు ఎక్కువై, తక్కువై కాదు రంగు రంగుల ఫుడ్డు చూసి కక్కుర్తిపడ్డా, మెరిసేదంతా మేలిమి కాదని తెల్సి తెల్సి వెళ్లాను చూడూ, నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలి అంది డాంకీ. చెప్పుల్తో కొట్టుకోడం అవి తొడుక్కుని పాదయాత్రలు చేసే లీడర్లకి

రంగస్థలం

కుదురుతుంది కాని మనకెట్లా వీలుపడుతుంది. కొట్టుకోవడం సంగతి వదిలి కక్కుర్తి సంగతేమిటో చెప్పు వినాలని కుతూహలంగా ఉంది అంది డాగీ. నీ దగ్గర దాచగలనా ఏమైనా. రోజూలాగే రోడ్డు సెన్సు లేని మనుషులు రోడ్డు మీద గిరాటేసే దినపత్రికల ముక్కలు నవిలేస్తే అయిపోయేది కానీ అక్కడెక్కడో గాలిలో వేలాడుతూ రంగురంగుల కాయితాలు కనపడేసరికి, ఒళ్లు కొవ్వెక్కి, కళ్లు నెత్తికెక్కి ఆ వైపుకి వెళ్లాను. అన్ని రంగుల కాగితాల్తో ఒక్కటీ పంటి కిందకి రాకముందే జనం ప్రవాహంగా వచ్చిపడ్డారు. ముసలీ ముతకా చిన్నా చితకా, పైలా పచ్చీసు, దూస్రా పచ్చీసుగాళ్లు, సుడిగాలి వేగంతో వచ్చి ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ, తొక్కుకుంటూ వచ్చి నేను వెనక్కి తిరిగి పరుగందుకునేలోపునే నన్ను తోసి కిందపడేసి నా మీద 'సూసేకీ అగ్గిపుల్ల లాగే ఉంటాడు నా సామి' దాన్సు వేశారు. మామూలు దరువా అది ఒళ్లు పచ్చడే అయింది. ఆయుష్షు మిగిలుందేమో బతికి బయటపడి అరుగుమీద పడి కుయ్యో్య్ మొర్రోవ్ మంటున్నాను. ఒంట్లో నొప్పిగా లేని చోటు అంటూ లేదనుకో అంది పెద్దగా మూలుగుతూ డాంకీ. ఏంటి డాంకీ మూలుగుతున్నావు. చలి పులిలా వణికిస్తున్నదా అంటూ అరుగు ఎక్కాడబ్బాయి. చలికి వణికి చావాలి తప్ప మాకేం దుప్పట్లా, శాలువాలా? ఇందాక వస్తుంటే ఓ కవిగారు శాలువా కప్పుకుపోతున్నాడు, కవి సమ్మేళనంలో కప్పారనుకుంటా అంది డాగీ. నేనూ చెప్తా కవిత్వం, నాకూ కప్పుతారా శాలువ అంది డాంకీ. కవి సమ్మేళనంలో చోటూ, శాలువా సంపాదించగలిగే పైరవీ నీ వల్లకాదు గాని నీ ఏడుపు సంగతేంటో చెప్పు అన్నాడు అబ్బాయి. ఏముంది బ్రో కక్కుర్తి. రంగురంగు కాగితాలని అక్కడెక్కడికో పోయి చావు తొక్కిళ్లు తొక్కించుకొచ్చింది డాంకీ అంది డాగీ. ఓ! అదా సంగతి! అంటే ఆ సినిమా ప్రీమియర్ షో గుంపులో జొరబడ్డావన్న మాట. అవునా అది సినిమా గోలా ఆ రంగు కాగితాల వర్షం అందుకేనన్న మాట ఏంటి డాంకీ నువ్వు రోజూ పేపర్లు నవుల్తూ కూడా మరచిపోయావా అంది డాగీ.

కక్కుర్తిపడి మరిచిపోయిందో, మరచిపోయి కక్కుర్తిపడిందో కానీ కుయ్యో్య్ మొర్రోవ్ మంటూనన్నా రాగలిగింది కానీ ఇంకా నయం అక్కడ యమపాశం పట్టుకు జనంలో నిలబడున్న యముడికి కనిపించలేదు. అంత మంచి సినిమానా, నరకంనించి యముడు కూడా వచ్చేడా అంది అమాయకంగా డాగీ. మంచి సినిమానేనేమో అందుకేకదా సర్కారు వారు దొరికినంతా దోచుకోండి అని టిక్కెట్ల ధరలు పెంచుకోమన్నారు. రోజూ అరేం ఖర్మ పది ఆటలు ఆడించకోమన్నారు. ఒక వెండి తెరేమిటి మల్టీప్లెక్సుల్లో రచ్చరచ్చ చేసేయండన్నారు. అనాలి మరి ప్రజలలో మంచినీ, మానవత్వాన్నీ, ప్రేమనీ, అనురాగాన్నీ పెంచి పోషించి సన్మార్గులను చేసే సినిమాకు ఏమిచ్చినా తప్పులేదు కదా అంది డాగీ. నువ్వో సత్తెకాలపు సుత్తి డాగ్‌వి. అవన్నీ కృతయుగం కాలం నాటి సంగతులు ఇప్పుడిది కలికాలం ఆకలికాలం. ఉత్తమ పురుషుల కాలం కాదు ఉత్తమ విలన్ల కాలం. హింసకు స్వర్ణయుగం. పాన్ ఇండియా శకం. కోట్లు కోట్లు కొల్లగొట్టే వికృతపు వికారపు చేష్టల వినోద సంబరం. జనానికి పూనకం వచ్చి ఊగే జాతర సీజన్. బాగా చెప్పావుగానీ బ్రో ఇంతకీ యముడి గురించి పూర్తిగా చెప్పనే లేదు అంది డాంకీ బతికి అరుగు ఎక్కగలిగినందుకు సంతోషిస్తూ...ఏముంది ఓ తల్లీ తండ్రీ కూతురూ, కొడుకూ. జన ఘోషకు బెదిరి యముడి మహిషం ఆ తల్లిని తొక్కేసింది. భర్తకు భార్య లేకుండా పోయింది, కూతురుకు తల్లి కరువైంది. కొడుకు ఉంటాడో, ఉండడో తేలకుండా ఉన్నది అన్నాడు అబ్బాయి. అయ్యయ్యో సినిమా! నిండు సంసారాన్ని ముక్కలు చేశావా అంది డాగీ. పోయిన ప్రాణం ఖరీదు కట్టిస్తారటలే లక్షలలో అన్నాడబ్బాయి. ప్రాణం ఖరీదు ఎంతో కుక్క చావు చచ్చే మాకన్నా ఎక్కువే అయ్యుంటుందిలే పైగా కోట్ల నోట్ల వ్యవహారం అంది డాగీ. పాతికో, పదో ఇచ్చి వదిలించుకుంటారు కానీ సర్కారు వారికీ సినిమాల పిచ్చి ఏమిటో అంది డాంకీ. ప్రజల్ని మద్యం మత్తులోనూ, వినోదం పేర అజ్ఞానపు అంధకారంలోనూ ఉండేట్టు చెయ్యడానికి ఏ ప్రభుత్వమైనా తగ్గేదేలే అంటుంది. ఎటువంటి హింసకైనా తెగబడి, ఏ దరువు డాన్సులకైనా ఎగబడి, ఏ విలువలకైనా తొక్కి నారతీసి జనాన్ని ఊగించే ఈ మహా మాయ జగత్తులో తగ్గేదేలే అంటున్నారు 'సిల్వర్ స్క్రీన్' విక్రేతలు అంటూ అరుగు దిగి వెళ్లిపోయాడు అబ్బాయి.

మానవనిర్మిత మహాద్భుతానికి 70 ఏళ్లు

అక్కినపల్లి మల్లిఖార్జునరావు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మణిహారమై నాగార్జునసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు భారతదేశం సగర్వంగా తలెత్తుకునేలా చరిత్రపుటల్లో నిలుస్తోంది. మనిషి మేధస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చు. దానికి త్రికరణశుద్ధిగా అంకితభావం కూడా జోడైతే ఇక ఆ మనిషి చేసే ప్రక్రియలన్నీ మానవాళికి మహోన్నత మేలు జరుగుతాయి. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రథమ చిహ్నమైన ఈ ప్రాజెక్టును నాగార్జున సాగర్ (విజయపురి సౌత్) వద్ద కృష్ణానదిపై నిర్మించారు. ఈ ప్రాంతానికి ఘనమైన చరిత్ర, ఎనలేని ప్రాశస్త్యం ఉంది. మహాయాన మాధ్యమిక ప్రముఖుడు ఆచార్య నాగార్జునుడు ఇక్కడ బౌద్ధారామం నెలకొల్పి దేశ విదేశాల విద్యార్థులకు విద్యను పంచిన కారణంగా ఇది అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా వెలుగొందింది. అందువల్లనే ఈ ప్రాజెక్టుకు ఆచార్య నాగార్జునుడి పేరిట నాగార్జున సాగర్‌గా నామకరణం చేశారు. గతంలో ఇక్కడ విజయపతాకాన్ని ఎగుర వేసిన ఇక్ష్వాకు వంశస్తుల రాజధాని విజయపురి నేటికీ అదే పేరుతో వాడుకలో ఉంది. నాగార్జునసాగర్ డ్యామ్ శంకుస్థాపన అనంతరం 1956 ఫిబ్రవరి నెలలో నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణానికి ప్రాథమిక చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రధాన ఆనకట్ట నిర్మాణానికి ఎగువ కృష్ణా నీటిని మళ్లించేందుకు కాపర్ డ్యామ్ నిర్మాణం ప్రారంభించారు. 1957 జులై 12న అప్పటి కేంద్ర నీటి పారుదల, విద్యుత్ శాఖ మంత్రి ఎస్.కే పాటిల్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కాపర్ డ్యామ్ నిర్మాణంతో పాటు నీటిని మళ్లించేందుకు పెద్ద కొండను తొలిచి సొరంగ మార్గాన్ని ఏర్పాటుచేశారు. 27 అడుగుల వ్యాసంతో 290 అడుగుల నిడివిగల ఈ సొరంగం చూపరులకు ఆశ్చర్యం గొల్పుతోంది. డ్యామ్ నిర్మాణ సమయంలో రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఎందరో కార్మికులు కదలిరాగ ఇదొక శ్రామిక నగరంగా మారింది. సుమారుగా 50,000మందికి పైగా కార్మికులు రేయింబవళ్లు మూడు షిఫ్టుల వారీగా స్వేదం చిందించారు. ఈ ప్రశాంత విప్లవంలో వందలాది మంది కార్మికులు అశువులు బాశారు.

1948వ సంవత్సరంలో నిజాం పాలన అంతమై భారత రాజ్యాంగంలో విలీనమై హైదరాబాద్ రాష్ట్రం అవతరించిన అనంతరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆలోచన మొదలైంది. సముద్రమట్టానికి 546అడుగుల ఎత్తులో ఆనకట్ట నిర్మించి నల్లగొండ, ఖమ్మం జిల్లాలో 8లక్షల ఎకరాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 2లక్షల 37వేల ఎకరాలు సేద్యం చేయవచ్చని భావించారు. ఆనకట్ట నిర్మాణంతో పాటు లక్షా 63వేల కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల విద్యుత్ కేంద్రం కూడా ఈ పథకం అంతర్భాగం. ప్రపంచంలో మానవ నిర్మిత రిజర్వాయర్లలో మూడో స్థానాన్ని ఆక్రమించిన నాగార్జునసాగర్ రిజర్వాయర్ 110 చదరపు మైళ్ల విస్తీర్ణం, 408 (టీఎంసీ) శతకోటి ఘనపుటడుగుల నీటి నిల్వ సామర్థ్యం కల్గి ఉంది. ఈ రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా 36 వేల క్యూసెక్కుల నీరు సరఫరా జరిగేందుకు చర్యలు చేపట్టారు.

నాగార్జునసాగర్ డ్యామ్ శంకుస్థాపన 1955 డిసెంబర్ 10న తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతులమీదుగా జరిగింది. నాడు ప్రధాని



మాట్లాడుతూ ఈ బహుళార్థక సాథక ప్రాజెక్టును స్వతంత్ర భారతావనిలో మనం నిర్మించుకుంటున్న ఆధునిక దేవాలయంగా అభివర్ణించారు. విదేశీ ఇంజినీర్ల సాంకేతిక పరిజ్ఞానంతో నిమిత్తం లేకుండా భారతీయ ఇంజినీర్లు తమ ప్రతిభా పాటవాలతో మొట్టమొదటిసారిగా నాగార్జునసాగర్ ఆనకట్టను అద్భుతంగాకట్టి ఇక్కడి మట్టి గొప్పతనాన్ని ప్రపంచదేశాలకు చాటారు. యావత్ ప్రపంచ సాంకేతికలోకమే అబ్బుర పడేలా అత్యధిక ఎత్తు, నిడివిగల మహత్తరమైన ఈ డ్యాంను పూర్తిస్థాయిలో రాతితోనే నిర్మించారు. పుష్కర కాలం పాటు కార్మికులు ఇంజినీర్లు సల్పిన కృషి, పట్టుదల ఫలితంగా 1969 నాటికి డ్యాం నిర్మాణం పూర్తయింది. ప్రధాన డ్యాంకు రెండు పక్కలా ఎర్త్‌డ్యాంలు నిర్మించారు. ప్రధాన డ్యాం భాగంలో 1540 అడుగులు నిడివి గల జలప్రవాహిత (స్పిల్‌వే) భాగం ఉంది. ఈ స్పిల్‌వే పైన 26 రేడియల్ క్రస్ట్‌గేట్లను 13.71/13.41 మీటర్ల సమానమైన కొలతలతో ఏర్పాటు చేశారు. వీటిని అమర్చిన తదుపరి జలాశయ నీటిమట్టం పూర్తిస్థాయిలో 590 అడుగులుగా అయింది. 110 చదరపు మైళ్ల విస్తీర్ణంలో జలాశయం ఏర్పడింది. 1973-1974 సంవత్సరాల్లో క్రస్ట్ గేట్ల నిర్మాణం పూర్తయింది. కీ.శే దాసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పులుపుల శివయ్య తదితరులు నందికొండ డ్యాం కావాలని 1948వ సంవత్సరంలో చేసిన అందోళనకు ఫలితంగా దక్కినందుకు పలనాటి సీమ అనందించగా, తెలంగాణ ప్రాంతం పులకించి పోయింది. డ్యాం నిర్మాణానికి నాగార్జునసాగర్ అనువైన ప్రదేశం కావడంతో నిర్మాణ పనులు సాఫీగా సాగాయి. ఇక్కడ రెండు కొండల నడుమ కృష్ణానది వెడల్పు తక్కువగా ఉండడం, నేల సైతం దృఢంగా ఉండడానికి తోడు ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన రాయి, ఇసుక సమీపంలోనే లభించడంతో నిర్మాణం త్వరితగతిన పూర్తయింది.

నాగార్జునసాగర్ కుడికాల్వ తవ్వకాన్ని 1956 అక్టోబర్ 10వ తేదీన అప్పటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. దీని నిర్మాణానికి 1250మంది కార్యాలయ సిబ్బంది. నాలుగువేల మంది సాంకేతిక సిబ్బంది, 40,000 మంది సాధారణ కార్మికులు దాదాపు పుష్కరకాలంపాటు పనిచేశారు. సాగర్ రిజర్వాయర్ నుంచి ఈ కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద 9గేట్లు అమర్చారు. ఈ హెడ్ రెగ్యులేటర్ వద్ద జల విద్యుత్ కేంద్రం కూడా నిర్మించారు. ఈ కాల్వ దక్షిణ విజయపురి వద్ద సొరంగ మార్గం ద్వారా ప్రవహిస్తుంది. దీని పొడవు పూర్తి నిర్మాణ దశలో 245మైళ్లు. ఇది సోమశిల వద్ద పెన్నానదిలో కలుస్తుంది. ఈ కాల్వ 21,000 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో 20లక్షల 62వేల ఎకరాల భూమికి సేద్యపు నీరు సరఫరా చేయగల శక్తి కలిగి ఉందని భావించారు. ప్రస్తుతం దాదాపుగా 8లక్షల పైచిలుకు ఎకరాలకు మాత్రమే నీటి సదుపాయం ఉన్నట్లు తెలుస్తున్నది. కుడి కాల్వ చంద్రవంక, నాగులేరు, గుండ్లకమ్మ, బుగ్గేరు, మొదలైన 178పెద్ద, చిన్న వాగులను దాటుకుంటూ ప్రయాణం చేస్తుంది.

1967అగస్టు 4వ తేదీన కీ.శే ప్రధాని ఇందిరాగాంధీ ఈ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి ఆంధ్ర జాతికి అంకితం చేశారు. దీనికి ప్రథమ ప్రధాని జ్ఞాపకార్థం జవహర్ కెనాల్ అని నామకరణం చేశారు. సాగర్ ఎడమ కాల్వకు జై జవాన్ - జై కిసాన్ అని పిలుపునిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జ్ఞాపకార్థం లాల్ బహదూర్ కెనాల్ అని నామకరణం చేశారు. ఈ కాల్వ ప్రారంభమైన కొంత దూరం తరువాత పొట్టిచెల్మ నుంచి చలకుర్తి గ్రామం వరకు కొండల అడుగు భాగంలో తొలచిన సొరంగ మార్గం ద్వారా ప్రవహిస్తుంది. సొరంగ మార్గం 32 అడుగుల వ్యాసం, 8465 అడుగుల నిడివి కలిగి గుర్రపునాడ

> విదేశీ ఇంజినీర్ల సాంకేతిక పరిజ్ఞానంతో నిమిత్తం లేకుండా భారతీయ ఇంజినీర్లు తమ ప్రతిభా పాటవాలతో మొట్టమొదటిసారిగా నాగార్జునసాగర్ ఆనకట్టను అద్భుతంగాకట్టి ఇక్కడి మట్టి గొప్పతనాన్ని ప్రపంచదేశాలకు చాటారు. యావత్ ప్రపంచ సాంకేతికలోకమే అబ్బుర పడేలా అత్యధిక ఎత్తు, నిడివిగల మహత్తరమైన ఈ డ్యాంను పూర్తిస్థాయిలో రాతితోనే నిర్మించారు.

ఆకారంలో మలచ బడిఉంది. కాల్వ ప్రవహించే సొరంగ మార్గం యావత్ భారతదేశంలోనే పెద్దదిగా తెలుస్తోంది. ఈ సొరంగం నిర్మాణానికి 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమసేన సచార్ శంకుస్థాపన చేశారు. కాల్వనిడివి తుది దశలో 218మైళ్లు. ఇది హాలియా, మూసీ, గడవరం, వైరా, కట్టలేరు, తమ్మిలేరు మొదలైన 138పెద్దా, చిన్న వాగులను దాటుకుంటూ నల్లగొండ, ఖమ్మం, కృష్ణా జిల్లాలోని ప్రవహించి చివరకు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎర్రకాల్వలో కలుస్తుంది. దీని నిర్మాణానికి 900 మంది కార్యాలయ సిబ్బంది, 2,500 మంది సాంకేతిక సిబ్బంది, 30వేల మంది కార్మికులు దాదాపు పదేళ్లపాటు విశేషంగా కృషి చేశారు. దీనిని కూడా 1967 అగస్టు 4వ తేదీన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నీటిని విడుదల చేసి ప్రారంభించారు.

సూపర్ టాక్సుపై మోదీ మౌనం

నిత్యచక్రవర్తి

దేశంలో పేదరికాన్ని దాదాపుగా పరిష్కరించినట్టు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. అయితే వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఈ నేపథ్యంలో సంపన్నులపై సూపర్‌టాక్సు విధించి అదనపు వనరులు సేకరించి పేదలకు ఉద్యోగాలు సృష్టించి అపారంగా పెరిగిన నిరుద్యోగాన్ని పరిష్కరించాలని వామపక్షాలు, అభ్యుదయ శక్తులు చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ మోదీ ప్రభుత్వం పెడచెవిని పెడుతోంది. ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన జి20 దేశాల సమావేశం ఆకలి, పేదరికం, నిరుద్యోగ సమస్య తీర్చడం కోసం సంపన్నులపై సూపర్‌టాక్స్ విధించాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు సమావేశం తీర్మానం విడుదల చేసింది. మూడవసారి మోదీ తిరిగి అధికారంలోకి వచ్చి ఆరునెలలలోపే అయింది. ఈ ప్రభుత్వం వచ్చాక రెండోసారి 2025 ఫిబ్రవరిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టవలసి ఉంది. ఇందుకు ఆర్థిక మంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ఈ బడ్జెట్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్నారు. జి 20 దేశాల తీర్మానంపైన ఇండియా కూడా సంతకం చేసింది. నరేంద్ర మోదీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి పన్ను విధించాలని సమావేశం తీర్మానించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సంపన్నులపై సూపర్ టాక్సు విధించి వచ్చే వనరులను అణగారిన ప్రజల అభ్యుదయానికి చర్యలు చేపట్టడానికి తగినంత సమయం ఉంది. ప్రభుత్వం ముందు రెండు ప్రధాన సవాళ్లున్నాయి. పెద్దఎత్తున ఉద్యోగాలు సృష్టించడం, దిగువస్థాయిలో నివసిస్తున్న ప్రజల ఆదాయాలు పెంపొందించడం.

నిరుద్యోగులకు ఉద్యోగాలు సృష్టించడానికి అత్యంత సంపన్నుల నుంచి సూపర్‌టాక్సు విధించడానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ప్రధానమంత్రి కార్యాలయానికి నైతిక బాధ్యత ఉంది. మోదీ పాలనలో ప్రత్యేకించి మహిళలు, చదువుకున్న యువత ఎక్కువగా కష్టాలు పాలైందని తాజాగా వెలువడిన నివేదికలు వెల్లడించాయి. ముఖేష్ అంబానీ తదితర వాణిజ్యవేత్తలు,

సినిమానటులు తమ పిల్లలకు వందల కోట్లు ఖర్చుచేసి వివాహాలు చేస్తున్నారు. ముఖేష్ అంబానీ ఇంట వివాహానికి వేయికోట్లకుపైగా ఖర్చు చేసినట్లు అంచనా వేశారు. దేశంలో అత్యంత సంపన్నులు ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్న పరిశ్రమ నెలకొని ఉంది. ఇలా ఖర్చుచేసే వారిలో బడా పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు కొంతమంది రాజకీయ నాయకులు ఈ జాబితాల్లో ఉన్నారు. ఇలా ఖర్చుచేసే వారి నుంచి అదనపు వనరులు సమీకరించాలి. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల పాలనా కాలంలో 185 మంది బిలియనీర్లు పెరిగారు. ఇంకా వీరి సంఖ్య వేగంగా పెరుగుతోంది. అంటే అతి సంపన్నుల సంఖ్యను పెంచుతూ, మరోవైపు పేదరికాన్ని పరిష్కరించడంలేదు. ప్రత్యక్ష, పరోక్ష సబ్సిడీలను తగ్గించాలి. బిలియనీర్లయిన 165 మందిపైన 2శాతం పన్ను విధిస్తే దీని ద్వారా 150 లక్షల కోట్లకుపైగా సమీకరణ జరుగుతుంది. వీటిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా నిరుద్యోగం తగ్గించడం, కార్మికులకు ఎక్కువ పనులు ఉండేట్టుగా చూడవచ్చు. భారత్‌లో వారసత్వ సంపద పన్నులు లేవు. అమెరికాతో పోల్చుకుంటే భారత్‌లో కేపిటల్ గెయిన్స్‌పై టాక్సు అతి తక్కువ. పన్నుల వ్యవస్థ ఇండియాలో అతి సంపన్నులకు అనుకూలంగా ఉంది. కరోనా సమయంలో బాధితులకు సహాయం చేయడం మరిచి మోదీ ప్రభుత్వం సంపన్నుల పన్ను 1.84 ట్రిలియన్ల మేర తగ్గించడం వల్ల ఖజానాకు తీవ్ర నష్టం జరిగింది. కోవిడ్-19 కాలంలో దాదాపు 50లక్షల మంది చనిపోయారని ఐక్యరాజ్యసమితి అంచనావేయగా మన ప్రభుత్వం 5 లక్షల మంది మృతి చెందారని ప్రకటించింది. మృతుల కుటుంబాలకు పరిహారం ఇస్తామనిచెప్పి చివరకు ఎగవేసింది. పైగా కోట్లాదిమందికి ఉద్యోగాలు ఊడాయి. సూపర్‌టాక్సు వసూలు చేస్తే 20వేల మందికి ఉద్యోగాలు సృష్టించవచ్చు. 2023లో అడ్వొకసీ గ్రూపు టాక్సు జస్టిస్ నెట్‌వర్కు ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 4.8 ట్రిలియన్ డాలర్లు నష్టం జరిగింది. మన దేశంలో ఇప్పటికే అతి సంపన్నులపై సూపర్‌టాక్సు విధించడం ఎప్పుడో జరిగి ఉండవలసింది. ఆక్స్‌ఫామ్ 2024 జనవరిలో విడుదలచేసిన నివేదికలో, అసమానతలు ఇంకా పెరుగుతున్నాయని తెలిపింది. కోవిడ్ సమయంలో, ఆ తర్వాత పేదలకు సామాజిక భద్రత, హామీ ఇవ్వకపోవడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో జీవించారు. ఈ పరిస్థితులతోపాటు అన్ని నిత్యావసర వస్తువుల ధరలు అపారంగా పెరిగాయి. పైగా సంపన్నులు, ఎగువ మధ్యతరగతి వారి ఆదాయాలు పెరిగాయి. అసమానతలు భారత ప్రజలపై ప్రత్యేక ప్రభావం చూపుతోంది. పశ్చిమ, లాటిన్ అమెరికా దేశాల్లో అభివృద్ధి చెందుతున్న అనేక దేశాల్లో సామాజిక భద్రతా చర్యలు చేపట్టినట్టుగా మన దేశంలో చేపట్టకపోవడంతో సామాన్యపౌరులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం, కేవలం ఐదుగురి చేతుల్లో పరిశ్రమలు వివిధరకాల వస్తువులు ఉత్పత్తి చేస్తున్నాయి. దీంతో రోజురోజుకీ బిలియనీర్లు అవుతున్నారు. తాజా అంచనా ప్రకారం భారత్‌లో 185 మంది బిలియనీర్లు అయ్యారు. మరోవైపు చివరకు దిగువ మధ్య తరగతి పౌరుల ఆదాయాలు పడిపోతున్నాయి.

ఆశ్రిత పెట్టుబడిదారులు గతంలో ఏనాడూలేనంతగా ప్రైవేటు ఈక్విటీ నిధుల వల్ల అసమానతలు పెరుగుతూనే ఉన్నాయి. అదే సమయంలో పేదరికం తగ్గడంలేదు. అయితే ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా ప్రచారం చేస్తోంది. దళితులు, ఇతర పేదలు, ఆరోగ్యరంగంలో సొంత ఆదాయాన్ని ఖర్చుచేయవలసి వస్తోంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం, అసమానతలు తీవ్ర ఆదోళన కలిగిస్తున్నాయి. కోవిడ్ ప్రజలను భయకంపితులను చేసిన మూడేళ్లపాటు, అలాగే యుద్ధం కారణంగా జీవన వ్యయం పెరిగి ప్రజలు సంక్షోభంలో కూరుకుపోయారు. వీటితోపాటు వాతావరణ కాలుష్యం కారణంగా ప్రజలు అలవిమాలిన స్థితికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో జి20 దేశాల సదస్సు చరిత్రాత్మక తీర్మానం చేసింది. న్యాయమైన, పారదర్శకమైన, పురోగతికి దోహదంచేసే పన్ను విధించాలని ఆహ్వానించదగిన తీర్మానం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు, ప్రత్యేకించి ఆఫ్రికా దేశాలకు ఎంతైనా ఉపయోగ పడుతుంది. ఆఫ్రికన్ యూనియన్ అధ్యయనం ప్రకారం, పన్ను ఎగవేతల వలన బిలియన్ల అమెరికా డాలర్లు ఆఫ్రికా కోల్పోతుంది. ఈ నిధులు వాతావరణ కాలుష్యం తగ్గించడానికి, విద్యారంగం మౌలిక సదుపాయాల కల్పనకు, తక్షణం ఆరోగ్య భద్రతా చర్యలకు ఉపయోగపడుతుంది. ఆఫ్రికా ఖండం పన్నుల వసూళ్ల వ్యవస్థను పెంచుకోకపోతే వాతావరణ సంక్షోభం మరింత పెరుగుతుంది. ఏడాదికి 90 బిలియన్‌డాలర్లు ఆఫ్రికా ఖండం కోల్పోతుందని అధ్యయనం తెలియజేస్తోంది. భారత్‌లో నల్లధనులు సూపర్‌టాక్సు విధించకపోతే భవిష్యత్‌లో పరిస్థితులు మరింతగా తల్లకిందులవుతాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనైనా సూపర్‌టాక్స్‌ను బిలియనీర్లకు విధించాలి.

రైతుల ఆందోళనలు అడ్డుకోవద్దని పిటిషన్: తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పంజాబ్, హర్యానా రైతులు తాము పండించిన పంటకు ఎంఎస్‌పీ (మద్దతు ధర)ని చట్టబద్ధం చేయాలని కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం దిల్లీకి పాదయాత్ర (దిల్లీ ఛలో మార్చ్) కూడా చేపట్టారు. అయితే రైతుల ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం అణగదొక్కేందుకు యత్నిస్తోంది. రైతులపై పోలీసులతో బాష్పవాయువు ప్రయోగించింది. అక్రమంగా అరెస్టులు చేయించింది. దీంతో రైతుల ఆందోళనలను అడ్డుకోవద్దని తాజాగా పంజాబ్‌కు చెందిన సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆందోళనలో భాగంగా రైతులు రైల్వే ట్రాకులను, జాతీయ రహదారులను దిగ్బంధిస్తున్నారు. రైతుల ఆందోళనలను అడ్డుకోకుండా కేంద్రానికి, పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. అయితే సోమవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది.

సాంకేతిక లోపంతో విమానాల అత్యవసర ల్యాండింగ్

చెన్నై: చెన్నై నుంచి కొచ్చి బయలుదేరిన ఓ ప్రైవేటు విమానాన్ని సాంకేతిక లోపం కారణంగా అత్యవసరంగా ల్యాండింగ్ చేసినట్లు చెన్నై విమానాశ్రయం అధికారులు పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున 117 మంది ప్రయాణికులతో చెన్నై నుంచి కొచ్చి బయలుదేరిన ఓ ప్రైవేటు విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ తిరిగి చెన్నైకి దారి మళ్లించారని తెలిపారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని, మరో విమానంలో వారిని తమ గమ్యస్థానానికి పంపినట్లు చెప్పారు. మరో ఘటనలో దిల్లీ నుంచి షిల్లాంగ్ వెళ్తున్న స్పైస్‌జెట్ విమానంలోనూ సాంకేతికలోపం తలెత్తినట్లు అధికారులు వెల్లడించారు. విమానాన్ని అత్యవసరంగా పాట్నాలోని జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్, సోషల్‌మీడియాపై నిషేధం: కేరళ హైకోర్టు

తిరువనంతపురం: పని వేళల్లో సిబ్బంది మొబైల్ ఫోన్లు, సోషల్‌మీడియాలో కంటెంట్ చూడడంపై నిషేధం విధిస్తూ కేరళ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 'ఇప్పుడు చాలామంది సిబ్బంది పని వేళల్లో కానీ లేదా విరామ సమయంలో కానీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. సోషల్‌మీడియా కంటెంట్ వీక్షిస్తున్నారు. ఈ పనుల వల్ల రోజువారీ ఆఫీసు పనులకు ఆటంకం కలుగుతున్నట్లు గుర్తించాం. అందుకే ఇలాంటి చర్యలకు సిబ్బంది పాల్పడకూడదని విరామ సమయంలో, పనివేళల్లో ఆన్‌లైన్ గేమ్స్, సోషల్‌మీడియాపై నిషేధం విధించాం' అని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ ఉల్లంఘనలు అతిక్రమించినట్లైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని రిజిస్ట్రార్ జనరల్ జి. గోపకుమార్ సంతకం చేసిన మెమో పేర్కొంది. అయితే సీనియర్ అధికారులు, డ్రైవర్లు వారి రోజువారీ బాధ్యతల దృష్ట్యా ఈ నిబంధనలకు మినహాయింపునిచ్చారు.

మహిళా సాధికారతకు 'ఎల్ఐసీ బీమా సఖి యోజన'

కొత్త పథకం ప్రారంభించిన మోదీ

పానిపట్: మహిళా సాధికారత పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో పథకాన్ని ప్రకటించారు. బీమా సఖి యోజన అనే పథకాన్ని హర్యానాలోని పానిపట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రధాని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఉపాధి లభించనుంది. 18 నుంచి 70 ఏళ్ల లోపు మహిళలు ఈ పథకం ద్వారా ఎల్ఐసీ ఏజెంట్లుగా ఉపాధి పొందుతారు. మహిళలలో అక్షరాస్యత పెంపు, ఆర్థికంగా బలపడేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిం చడం, స్థిరమైన ఆదాయం ఉండేలా చూడటం పథకం ముఖ్య ఉద్దేశం. మహిళా ప్రగతికి అవరోధమైన సామాజిక ఇబ్బందులు తొలగించడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందినట్లు ప్రధాని తన ప్రసంగంలో తెలిపారు 'గతంలో కొన్ని పనులు మహిళలకు అప్పగించే విషయంలో ఆటంకాలు ఎదురయ్యేవి. మహిళలకు అలాంటి అవరోధాలు తొలగించాలని బీజేపీ నిర్ణయించింది. ప్రతి రంగంలోనూ మహిళలు రాణించేలా చేసేందుకు కట్టుబడి ఉన్నాం. లింగ సమానత్వం, వివిధ రంగాల్లో మహిళా సాధికారతను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు ఈ పథకం తీసుకువచ్చాం' అని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించడానికి ఒక ప్రత్యేకత కూడా ఉందని, భారతీయ గ్రంథాలు తొమ్మిదో సంఖ్యను అత్యంత శుభప్రదంగా భావిస్తాయని, 9వ సంఖ్య దుర్గామాత శక్తికి తార్కాణమని, సాధికారత, శక్తికి సంకేతమని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీనాడే రాజ్యాంగ సభ తొలి సమావేశం జరిగిందని చెప్పారు. 'ఏక్ హై తో సేఫ్ హై' నినాదాన్ని అక్కున చేర్చుకున్న హర్యానా రాష్ట్రాన్ని మోదీ అభినందించారు. ఐక్యత, భద్రత అనేవి యావద్దేశానికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

ఎల్ఐసీ బీమా యోజన పథకం కింద కనీసం 10వ తరగతి చదివిన మహిళలకు మూడేళ్ల శిక్షణ ఇస్తారు. అనంతరం ఎల్ఐసీ ఏజెంట్లుగా నియమిస్తారు. శిక్షణా కాలంలో స్టయిఫండ్, పాలసీ అమ్మకాల ఆధారంగా కమీషన్ ఇస్తారు.

ఇది టెక్, డేటా శతాబ్దం

జైపూర్: ప్రపంచవ్యాప్తంగా ప్రతి పెట్టుబడిదారుడు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ఆయన 'ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2024'లో సోమవారం ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనుంది. 'రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ మంత్రంగా భారత్ చేసిన అభివృద్ధి ప్రతి రంగంలోను కనిపిస్తోంది. గత పదేళ్లలో భారత్ 10 అతిపెద్ద ఆర్థికవ్యవస్థల నుంచి 5వ స్థానానికి చేరింది. గత పదేళ్లలో ఆర్థికవ్యవస్థ మారడంతో ఎగుమతులు రెట్టింపు అయ్యాయి. ఎఫ్‌డీఐలు కూడా రెండింతలు పెరిగాయి. ఈ సమయంలో దేశంలో ఇన్‌ఫ్రాపై వ్యయాలు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు చేర్చాం. భారత్ వంటి వైవిధ్యభరితమైన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం మనకు పెద్ద ఉపయోగం. మరికొన్నేళ్లపాటు మనం అత్యంత యువ దేశంగా ఉండనున్నాం. ఇక్కడే అత్యధికమంది నైపుణ్యవంతులైన యువకులు ఉంటారు. ఇది టెక్, డేటా నడిపించే శతాబ్దం. గత పదేళ్లలో ఇంటర్నెట్ వినియోగం నాలుగు రెట్లు పెరిగింది. డిజిటల్ చెల్లింపుల్లో భారీగా పుంజుకొంది. స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వాలు రాజస్థాన్ అభివృద్ధి, సంస్కృతిని నిర్లక్ష్యం చేశాయి. అందుకే ఈ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. 'వికాస్ భీ-విరాసత్ భీ' మంత్రంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాజస్థాన్‌లోని పరిస్థితులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు బాగా నేర్చుకొంటారు. భారత్‌లో అతిపెద్ద సోలార్ పార్కుల్లో చాలావరకు ఇక్కడే ఏర్పాటవుతున్నాయి.

డ్రైపోర్టులకు ఇది అత్యంత అనుకూల ప్రదేశం. రెండు ఎయిర్ కార్గో కాంప్లెక్సులు ఏర్పాటుచేశాం' అని మోదీ వ్యాఖ్యానించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి తొలుత మాట్లాడుతూ ఇప్పటికే రూ.30 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగినట్లు తెలిపారు. అనంతరం వ్యాపారవేత్తలు బిర్లా గ్రూప్‌నకు చెందిన కుమార మంగళం బిర్లా, మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా, వేదాంత రిసోర్స్ వ్యవస్థాపకులు అనిల్ అగర్వాల్ మాట్లాడారు.

ఇంట్లో పేలుడు... ముగ్గురి మృతి

కోల్‌కతా: ఒక ఇంట్లో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించారు. కొంతమంది గాయపడ్డారు. ఇంట్లో బాంబులు తయారు చేస్తుండగా ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. ఆదివారం రాత్రి ఖయర్తాలా ప్రాంతంలోని ఒక ఇంట్లో దేశీయ బాంబులు పేలాయి. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. రాత్రి వేళ పేలుడు శబ్దం విని స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పీకర్‌గా రాహుల్ నర్వేకర్ ఏకగ్రీవం

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ నర్వేకర్ ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఆయన ఆ పదవి చేపట్టారు. స్పీకర్ పదవి కోసం ఆయన ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు అజిత్ పవార్, ఏకనాథ్ షిండే, ఇతర బీజేపీ నేతలు ఆయనకు మద్దతిచ్చారు. స్పీకర్ పోస్టు కోసం మహా వికాశ్ అగాఢీ కూటమి నామినేషన్ దరఖాస్తు చేయలేదు. ప్రతిపక్ష నేత ఎన్నిక అంశంలో స్పీకర్ నర్వేకర్ పాత్రపై అందరి దృష్టి ఉన్నది. అసెంబ్లీలో ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీకి 10 శాతం కన్నా తక్కువ సీట్లు ఉన్నాయి. దీంతో ప్రతిపక్ష నేత హోదా ఇస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూలై 2022లో తొలిసారి నర్వేకర్ స్పీకర్‌గా నియమితుడయ్యారు. శివసేన ఎమ్మెల్యేలు అనర్హత పిటిషన్లు దాఖలు చేసిన సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

20 మందితో ఆప్ రెండో జాబితా

జంగ్‌పురా నుంచి సిసోదియా

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది జరగనున్న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సోమవారం రెండో జాబితాను విడుదల చేసింది. దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా జంగ్‌పురా నుంచి పోటీ చేయనున్నారు. సివిల్ సర్వీసెస్ టీచర్ అవధ్ ఓజా తూర్పు దిల్లీలోని పట్పర్‌గంజ్ బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుతం సిసోదియా ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం 20 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను ఆప్ విడుదల చేసింది. గత నెలలో 11 మంది అభ్యర్థుల పేర్లతో జాబితాను విడుదల చేసింది. 70 స్థానాలున్న అసెంబ్లీలో 39 స్థానాలకు అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. 2013లో దిల్లీ అసెంబ్లీ మాజీ స్పీకర్ మణీందర్ సింగ్ ధీర్ గెలిచినప్పటి నుంచి జంగ్‌పురా సీటు ఆప్‌లో అధీనంలో ఉంది. ధీర్ బీజేపీలోకి మారినప్పుడు... 2015, 2020 ఎన్నికలలో గెలిచిన ప్రవీణ్ కుమార్‌ను ఆప్ రంగంలోకి దించింది. అయితే ఈసారి ఈ సీటుకు సిసోదియాను ఎంపిక చేసింది. దిల్లీలో రద్దు చేసిన మద్యం పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మాజీ ఉప ముఖ్యమంత్రి బెయిల్‌పై బయట ఉన్నారు. ఆయన ఆరోపణలను ఖండించారు. 'ప్రజాకోర్టు' తీర్పు వచ్చిన తర్వాతే ప్రభుత్వంలో చేరతానని చెప్పారు. జంగ్‌పురా నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చినందుకు కేజ్రీవాల్‌కు, పార్టీకి ధన్యవాదాలు తెలిపిన సిసోదియా... పట్‌పర్‌గంజ్ 'దిల్లీలో విద్యా విప్లవానికి గుండెకాయ' అని అన్నారు. 'అవధ్ ఓజా పార్టీలో చేరినప్పుడు, ఉపాధ్యాయునికి పట్పర్‌గంజ్ ఉత్తమ సీటు అని నేను భావించాను' అని చెప్పారు. 'బాధ్యత అప్పగించడం' ఆనందంగా ఉందన్నారు. 'పట్‌పర్‌గంజ్‌లో విద్య, అభివృద్ధి కోసం నేను చేసిన పనిని ఇప్పుడు జంగ్‌పురాలో చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. పట్‌పర్‌గంజ్ నుంచి జంగ్‌పురా వరకు దిల్లీ అభివృద్ధికి నా ప్రతిజ్ఞ దృఢమైనది' అని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత జంగ్‌పురా ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్‌కు జనక్‌పురి సీటు కేటాయించారు. ఈ నెల ప్రారంభంలో ఆప్‌లో చేరిన అవధ్ ఓజాకు పట్పర్‌గంజ్ సురక్షితమైన సీటు. 2013 నుంచి సిసోదియా ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పు దిల్లీ నియోజకవర్గం ఆప్ కంచుకోటగా పరిగణించబడుతుంది. ఈ 20 స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎవరూ ఈసారి పునరావృతం కాకపోవడం గమనార్హం. ఆప్ నాల్గవ పర్యాయం అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చే చర్య నియోజకవర్గంలోని ఆ నిర్దిష్ట శాసనసభ్యునిపై అధికార వ్యతిరేకత లేదా ఫిర్యాదులను ఎదుర్కోవడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ఇదిలాఉండగా, బీజేపీ దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ ప్రజలు మార్పు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నందున చాలా మంది ఆప్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడటం లేదని తమకు సమాచారం అందిందని అన్నారు. 'మాజీ ఉపముఖ్యమంత్రి (సిసోదియా) పారిపోయారు, భయాన్ని ఊహించుకోండి. అరవింద్ కేజ్రీవాల్, ఆతిశి కూడా పారిపోతారు' అని తెలిపారు. కాగా న్యూదిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కేజ్రీవాల్, ముఖ్యమంత్రి ఆతిశి, ఎమ్మెల్యే కల్కాజీ పేర్లు ఆప్ రెండు జాబితాలలో కనిపించలేదు. సచ్‌దేవా మాట్లాడుతూ రాజవంశ రాజకీయాలకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ మాట్లాడుతున్నారని, అయితే చాందినీ చౌక్, కృష్ణా నగర్‌లలో రెండు టికెట్లు కుటుంబానికి (సిట్టింగ్ ఎమ్మెల్యేల సభ్యులు) ఇచ్చారని తెలిపారు.

శాంతిస్థాపనకు రాజకీయ ప్రక్రియ అవశ్యం

సిరియా సంక్షోభంపై భారత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: దశాబ్దానికి పైగా అంతర్యుద్ధంతో అల్లాడుతున్న సిరియాలో రాజకీయ అనిశ్చితి నెలకొంది. తిరుగుబాటుదారుల విజృంభణతో అధ్యక్షుడు బషర్ అల్-అసద్ దేశాన్ని విడిచి పారిపోయారు. దీంతో ఆయన ప్రభుత్వం కూలిపోయి... సిరియా పూర్తిగా తిరుగుబాటుదారుల నియంత్రణలోకి వెళ్లింది. ఈ పరిణామాలపై తాజాగా భారత విదేశాంగశాఖ స్పందించింది. సిరియాలో మళ్లీ స్థిరత్వం రావాలని ఆకాంక్షించింది. 'సిరియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు అక్కడి అన్ని పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. సిరియా ప్రజల అభీష్టానికి అనుగుణంగా శాంతిస్థాపన జరిగేలా సమ్మిళిత రాజకీయ ప్రక్రియ ఉండాలని సూచిస్తున్నాం' అని భారత విదేశాంగ శాఖ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సిరియాలో ఉన్న భారతీయుల భద్రత కోసం డమాస్కస్‌లోని భారత రాయబార కార్యాలయం నిరంతరం పనిచేస్తోందని పేర్కొంది. సిరియాలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ... అక్కడి భారతీయుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే వారంతా సురక్షితంగా ఉన్నట్లు విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. డమాస్కస్‌లోని మన రాయబార కార్యాలయాన్ని అన్నివేళలా తెరిచే ఉంచినట్లు పేర్కొన్నాయి. తిరుగుబాటుదారుల ఆక్రమణతో అధ్యక్షుడు అసద్ తన కుటుంబంతో సహా రష్యాకు శరణార్థిగా చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన మాస్కోలో ఉన్నారు. అధికార బదిలీపై తిరుగుబాటుదారులతో చర్చలు జరిపాకే అసద్ సిరియా వీడారని రష్యా ప్రభుత్వం తెలిపింది.

సీయూఈటీ యూజీ, పీజీ నిర్వహణపై కమిటీ

వచ్చే ఏడాది సిలబస్ మార్పు: యూజీసీ

న్యూఢిల్లీ: దేశంలో వచ్చే ఏడాది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు సంబంధించి యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) 2025 నిర్వహణ కోసం కొన్ని మార్పులు ప్రకటించనున్నట్లు యూజీసీ తెలిపింది. ఈ క్రమంలోనే సీయూఈటీ యూజీ, పీజీ నిర్వహణను సమీక్షించడానికి కమిషన్ ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. పదేళ్ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సీయూఈటీ విద్యార్థులకు మెరుగైన వాతావరణాన్ని అందించడానికి పరీక్ష ప్రక్రియను మెరుగుపరచడం అవసరమని యూజీసీ చైర్మన్ అన్నారు. అందుకోసం సిలబస్ విధానాన్ని మార్చనున్నట్లు తెలిపారు. నిపుణుల బృందం సమీక్ష తర్వాత 2025 ఎడిషన్‌లో అనేక మార్పులకు లోనవుతుందని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ స్పష్టం చేశారు. అందుకోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అనేక సంస్థల నుంచి అభిప్రాయాలు, సూచనలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. నిపుణుల కమిటీ సమీక్షించిన తర్వాత 2025లో సిలబస్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. కమిటీ పరీక్ష నిర్మాణం, పేపర్ల సంఖ్య, పరీక్ష పేపర్ల వ్యవధి, సిలబస్, కార్యాచరణ వంటి వివిధ అంశాలను ఇప్పటికే పరిశీలించినట్లు తెలిపారు. కమిషన్ ఇటీవలి సమావేశంలో ఈ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుందని ఆయన అన్నారు. సీయూఈటీ-యూజీ, సీయూఈటీ-పీజీ 2025 నిర్వహణకు సవరించిన మార్గదర్శకాలను వివరించే ముసాయిదా ప్రతిపాదనను కమిషన్ త్వరలో విడుదల చేస్తుందని ఆయన తెలిపారు. 2022లో జరిగిన మొదటి ఎడిషన్ పరీక్షలో సీయూఈటీ యూజీ సాంకేతిక లోపాలతో ఇబ్బంది పడింది. దీంతోపాటు ఒక సబ్జెక్టుకు సంబంధించిన పరీక్షలు బహుళ షిఫ్ట్‌లలో నిర్వహించబడుతున్నందున, ఫలితాల ప్రకటన సమయంలో స్కోర్‌లను సాధారణీకరించవలసి ఉంటుంది. పరీక్ష 2024లో మొదటిసారిగా హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించబడింది. అనేక కారణాలతో ఇది నిర్వహించటానికి ఒక రాత్రి ముందు దిల్లీ అంతటా రద్దు చేయబడింది. అయితే ఈ మార్పులను త్వరగా ప్రకటిస్తే విద్యార్థులకు చదువుకునేందుకు ఎక్కువ సమయం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆలస్యంగా సిలబస్ మార్పుల విధానాన్ని ప్రకటిస్తే వచ్చే ఏడాది జరగనున్న సీయూఈటీ-యూజీ, సీయూఈటీ-పీజీ 2025 విద్యార్థులకు ఇబ్బందులు ఉంటాయని అంటున్నారు. దీంతోపాటు గత ఏడాది జరిగిన తప్పులను ఈసారి జరగకుండా విద్యార్థులకు ఆటంకం లేకుండా అనుకూలమైన వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని అంటున్నారు.

రాజ్యసభకు బీజేపీ అభ్యర్థులు వీరే

న్యూఢిల్లీ: రాజ్యసభకు జరిగే ఉపఎన్నికల్లో మూడు రాష్ట్రాల నుంచి పోటీ చేసే తమ అభ్యర్థుల పేర్లను బీజేపీ సోమవారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హర్యానా నుంచి వారు పోటీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య, ఒడిశా నుంచి సుజీత్ కుమార్, హర్యానా నుంచి రేఖా శర్మ పోటీ చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం రాజ్యసభకు ఉప ఎన్నికలు డిసెంబర్ 20న నిర్వహిస్తారు. అదేరోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఆరుగురు సభ్యులను రాజ్యసభకు ఎంపిక చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు సీట్లు, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఎంపీలను రాజ్యసభకు పంపాల్సి ఉంది. జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఎంపీలు మోపిదేవి వెంకటరమణ రావు, బీద మస్తాన్ రావు యాదవ్, రాగ్య కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామా చేయడంతో ఆ మూడు స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది. ఈ మూడు సీట్లను చంద్రబాబు కూటమి గెలుచుకోవడం ఖాయం. అలాగే, నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజు జనతా దళ్ (బీజేడీ) ఎంపీ సుజీత్ కుమార్ రాజ్యసభకు రాజీనామా చేశారు. బీజేపీ ఈ సీటు గెలుచుకునే అవకాశం ఉంది. అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన జవహర్ సర్కార్ రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. ఉపఎన్నికల్లో ఈ సీటును టీఎంసీ సునాయాసంగా గెలుచుకోనుంది.

అధికార బీజేపీకి చెందిన కృష్ణలాల్ పన్వర్ రాజ్యసభ సీటుకు రాజీనామా చేశారు. ఈ సీటు బీజేపీ తిరిగి నిలబెట్టుకోనుంది. హర్యానాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజ్యసభ సీటుకు పన్వర్ రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆయన నయబ్ సింగ్ సైని మంత్రివర్గంలో అభివృద్ధి, పంచాయతీరాజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రిగా ఉన్నారు.

విశ్వాస తీర్మానం నెగ్గిన ఫడ్నవీస్ సర్కార్

ముంబై : దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మంత్రివర్గం సోమవారం మహారాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస తీర్మానం నెగ్గింది. శివసేన ఎమ్మెల్యే ఉదయ్ సమంత్ తదితరులు ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. విశ్వాస తీర్మానాన్ని సభ ఆమోదించినట్లు స్పీకర్ రాహుల్ నార్వేకర్ ప్రకటించారు. 288 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ-శివసేన-ఎన్‌సీపీ 'మహాయుతి' కూటమికి 230 సీట్ల మెజారిటీ ఉంది. అసెంబ్లీలో మెజారిటీ మార్క్ 144. 'విశ్వాస తీర్మానం మెజారిటీతో ఆమోదం పొందింది. శాసనసభ ఇప్పుడు వాయిదా పడింది. మహారాష్ట్ర గవర్నర్ ప్రసంగం తర్వాత తిరిగి ప్రారంభమవుతుంది' అని నార్వేకర్ అసెంబ్లీలో చెప్పారు. డిసెంబరు 5న ఫడ్నవీస్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముంబైలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న వేడుకలో ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 15వ శాసనసభ అధికారికంగా డిసెంబరు 7న తన పదవీకాలాన్ని ప్రారంభించింది.

288 మంది సభ్యుల దిగువ సభలో బీజేపీ నేతృత్వంలోని కూటమి 230 స్థానాలను కైవసం చేసుకోవడంతో బలపరీక్ష కేవలం లాంఛనమే. కాగా, శివసేన నేత, మాజీ మంత్రి ఉదయ్ సమంత్, బీజేపీ శాసనసభ్యుడు సంజయ్ కుటే, సీనియర్ ఎన్‌సీపీ నేత, మాజీ మంత్రి దిలీప్ వల్సే పాటిల్, స్వతంత్ర ఎమ్మెల్యే రవి రాణా విశ్వాస తీర్మానం ప్రతిపాదనను దిగువ సభలో ప్రవేశపెట్టారు. నార్వేకర్‌ను స్పీకర్‌గా నియమించడంతో మహాయుతి కూటమికి ఇప్పుడు చిన్న పార్టీలు, స్వతంత్ర ఎమ్మెల్యేలతో సహా 229 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది.

15వ అసెంబ్లీలో పార్టీల స్థానాలను పరిశీలిస్తే... మహాయుతి - బీజేపీ 132 ఎమ్మెల్యేలు, శివసేన 57, ఎన్‌సీపీ 41, జన్ సురజయ శక్తి పార్టీ 2, రాష్ట్రీయ యువ స్వాభిమాన్ పార్టీ 1, రాష్ట్రీయ సమాజ పక్షం 1, స్వతంత్రులు 2, రాజర్షి షాహు వికాస్ అఘాడి 1 కలిగి ఉన్నాయి. ఇక ప్రతిపక్షం విషయానికొస్తే... శివసేన (యూబీటీ) 20 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ 16, ఎన్‌సీపీ (ఎస్‌పీ) 10, సీపీఎం 1, పీడబ్ల్యూపీ 1, ఏఐఎంఐఎం 1, సమాజ్‌వాదీ పార్టీ 2 స్థానాలతో ఉన్నాయి.

నీతా అంబానీకి సీఎన్‌బీసీ అవార్డు అందజేత

ముంబై: రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ నీతా ముఖేశ్ అంబానీకి సీఎన్‌బీసీ-టీవీ18 అవార్డు దక్కింది. ఇండియా బిజినెస్ లీడర్ అవార్డులను ముంబైలో అందజేశారు. ఔట్‌స్టాండింగ్ కంట్రిబ్యూషన్ టు బ్రాండ్ ఇండియా అవార్డును నీతా అంబానీ గెలుచుకున్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా ఆమె అవార్డు స్వీకరించారు. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీ సంస్థ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. నీతా అంబానీ ఓ విజినరీ వ్యక్తి అని, ఆమె దాతృత్వానికి ప్రతీక అని, కళాపోషకురాలు అని, లక్షలాది మందికి ఆమె దిక్సూచి లాంటి వ్యక్తి అని రిలయన్స్ సంస్థ తన ట్వీట్‌లో తెలిపింది. అన్ని అంశాల్లోనూ ఆమెకు నాయకత్వ లక్షణాలు ఉన్నట్లు చెప్పింది. అనేక పాత్రలను ఆమె అవలీలగా పోషించగలదని వెల్లడించింది. అణగారిన వర్గాలకు విద్య అందించడం, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని రిలయన్స్ సంస్థ పేర్కొన్నది. భారతీయ కళలు, సంస్కృతికి ఆమె అనేక సేవలు చేశారు.

అధికారంలోకి వస్తే సామాజిక పింఛను పెంపు

ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్

పాట్నా : బీహార్‌లో తమ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణం అధికారంలోకి వస్తే సామాజిక భద్రతా పథకాల లబ్ధిదారులకు చెల్లించే మొత్తాన్ని మూడు రెట్లు పెంచుతామని ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్ హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, వికలాంగులకు చెల్లించే మొత్తాన్ని నెలకు రూ.400 నుంచి రూ.1,500కు పెంచుతామని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 'వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, 60 ఏళ్ల పైబడిన వారు లేదా వికలాంగులు, వితంతువులు కూడా సామాజిక భద్రతా పథకాల ద్వారా నెలకు రూ.1,500 పొందుతారు' అని రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అయిన తేజస్వి చెప్పారు. జేఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్ తిరిగి అధికారంలోకి రావడంలో సామాజిక భద్రతా పథకాల పాత్ర పోషించిన జార్ఖండ్‌లో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆర్‌జేడీ నేత... 'మాకు అవకాశం దొరికినప్పుడల్లా మేము మా వాగ్దానాలను నెరవేరుస్తాం' అని నొక్కి చెప్పారు. బీహార్‌లో ప్రస్తుతం చెల్లిస్తున్న నెలకు రూ.400 'అత్యల్పమైనది' అని అన్నారు. ప్రీ-పెయిడ్ మీటర్ల కారణంగా విపరీతమైన టారిఫ్ రేట్లు, తప్పుడు బిల్లింగ్ కారణంగా రాష్ట్ర ప్రజలకు '200 యూనిట్ల ఉచిత విద్యుత్' అని వాగ్దానం చేసిన వారం తర్వాత తేజస్వి యాదవ్ నుంచి ఈ తాజా ప్రకటన వచ్చింది.

ఏకాభిప్రాయం ద్వారా 'ఇండియా' నేత

ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' నేతను ఏకాభిప్రాయం ద్వారా ఎన్నుకుంటామని తేజస్వి యాదవ్ తెలిపారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో సహా కూటమికి చెందిన ఏ సీనియర్ నేత అయినా నాయకత్వం వహించడం పట్ల తనకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ 'కూటమికి మమతా బెనర్జీ నాయకత్వం వహించడంలో మాకు ఎలాంటి సమస్య లేదు. కానీ బీజేపీ వ్యతిరేక కూటమిలో చాలా మంది సీనియర్ రాజకీయ నాయకులున్నారన్నది గుర్తించుకోవాలి. కూటమి నేతను ఎన్నుకోవడంపై కలిసి కూర్చుని సమష్టి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే అన్ని పార్టీల ఏకాభిప్రాయం ద్వారానే ఇది జరుగుతుంది' అని తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా నిబంధనల ప్రకారం పనుల చేయాలని అన్నారు. పెండింగు పనులను ముందుగా పరిష్కరించాలని, కింది స్థాయిలో శాఖ పని తీరును పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసి పనులు పెండింగులో లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు.

కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పెట్, చందానగర్, భారతి నగర్ (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 59 మంది లబ్ధిదారులకు 59,06,844 రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ 59 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారని ఎమ్మెల్యే గాంధీ కొనియాడారు. నిరుపేదల బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా, మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గంగాధర్, చాంద్ పాషా, ఓ.వెంకటేష్, రజినీకాంత్, తిరుపతి, జాకీర్, పవన్ గౌడ్, నరేందర్ బల్లా, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కోసం పదవులను తృణప్రాయంగా త్యాజించిన త్యాగమూర్తి సోనియా గాంధీ అని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 125 డివిజన్ గాజులరామారం చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర కేకేసి వైస్ చైర్మన్ గంగుల అంజలి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలు, పరిశుద్ధ కార్మికుల చీరాల పంపిణీలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు, కేక్ తినిపించుకుంటూ తమ అభిమాన నాయకురాలి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పరిశుద్ధ కార్మికులకు వారి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డివిజన్ అధ్యక్షులు ఎండి లాయక్, పండరి రావు, సంతోష్ ముదిరాజ్, శ్రీధర్ రెడ్డి, ఈశ్వర్, బల్ రెడ్డి, అజయ్, నరేందర్ రెడ్డి, వేణు గౌడ్, శ్రీనివాస్ గుప్తా, బుచ్చి రెడ్డి, అనిల్ రెడ్డి, రహీమ్, ఖలీమ్, గఫ్ఫార్, అనిల్, అరుణ్, మహిళ కాంగ్రెస్ నాయకురాలు లలిత, ఫారీన్ ఖాన్, శ్యామల, శ్రీలత, శైలజ, శరధ, వెంకటలక్ష్మి, లతా, అశ్విని పాల్గొన్నారు.

ప్రాపర్టీ విజిట్ ఫెస్ట్ ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : 8,200 సైట్ సందర్శనలను అందించి, 450 కేవలం 6 నెలల్లో హోమ్ బుకింగ్స్ సాధించి ప్రతి హోమ్ బుకింగ్‌కి ఐఎన్ఆర్ 1.25 కోట్ల సగటు టికెట్ సైజ్‌ను సాధించి, డిమాండ్‌ను మరింత పెంచటానికి భారతదేశపు మొట్టమొదటి ప్రాపర్టి విజిట్ ఫెస్ట్‌ను ప్రారంభించింది. పెరుగుతున్న ఇళ్ళ డిమాండ్‌ను భారతదేశపు ప్రముఖ స్థిరాస్తి సంస్థ మ్యాజిక్ బ్రిక్స్, ఆరా రియాలిటీ, విజన్ ఇన్ఫ్రా డెవలపర్స్, ఎలిగెంట్ ఇన్ఫ్రా, పరణ కన్స్ట్రక్షన్స్ కలుపుకొని 100 డెవలపర్స్‌తో భాగస్వామ్యం కలుపుకొని తన సైట్ విజిట్ ప్రాడక్ట్‌ను పెంచింది. సైట్ విజిట్ ప్రాడక్ట్ ఇళ్ళు కొనుగోలుదారులకు ఆస్తి అన్వేషణను సులభం చేసింది. బడ్జెట్, ప్రదేశం, కాన్ఫిగురేషన్ వంటి వ్యక్తిగత ప్రాధాన్యతలపై క్యురేట్ చేయబడిన ప్రాజెక్ట్ సిఫారసులను అందించడం ద్వారా బిల్డర్లకు అమ్మకాలను పెంచింది. ప్రాపర్టి సందర్శనల కొరకు ఈ కార్యక్రమం అంతరాయాలు లేని ఎండ్-టు-ఎండ్ లాజిస్టికల్ సహకారాన్ని అందిస్తుంది, తద్వారా కొనుగోళ్ళను ఖరారు చేయుటకు పట్టే సమయాన్ని తగ్గిస్తూ, కొనుగోలుదారులు నమ్మకమై సూచిత నిర్ణయాలు తీసుకునే వీలు కలిగిస్తుంది. సుధీర్ పై, మ్యాజిక్ బ్రిక్స్ సీఈఓ, ఈ కార్యక్రమం విజయాన్ని పపై మాట్లాడుతూ "సంప్రదాయికంగా, ఇళ్ళ కోసం డిమాండ్ పండుగ సీజన్ కారణంగా డిసెంబరులో తగ్గిపోతుంది. అయితే గత 2-3 సంవత్సరాలుగా, సంభావ్య కొనుగోలుదారులు తమ కలల గృహాలను సంవత్సరమంతా కోరుకుంటూ ఉండడముతో ఇంటియాజమాన్యం కొరకు ఆకాంక్ష ధృడంగా ఉంది. బిల్డర్లను సంబంధించి ఉద్దేశాలతో ఈ స్థిరమైన డిమాండ్‌ను పెంచుటకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.

నేతన్నల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : చేనేత రంగాన్ని రక్షించేందుకు, నేతన్నల సంక్షేమానికి, అభివృద్ధికి మెరుగైన పథకాలు తెస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం హైదరాబాద్ అమీర్ పేట్ కమ్మ సంఘ భవనంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవంలో భాగంగా ఈనెల 6 నుండి 9 వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చేనేత వస్త్రా ప్రదర్శన, అమ్మకం ఎక్స్‌పో ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎక్స్పోలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర, హస్తకళల స్టాళ్లను మంత్రి పరిశీలించారు. నవంబర్ 2023 టెస్కోకు రావలిసిన బకాయిలు రూ. 428 కోట్ల 14 లక్షల 47వేల 226ల చెక్కు కార్మికుల సబ్సిడీ బకాయిలు 37 కోట్ల 49 లక్షల 68 వేలు, నూలు డిపో కార్పస్ ఫండ్ రూ.50 కోట్ల రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేతన్నల అభివృద్ధి, సంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎన్నో ఒడిదొడుగులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతన్నల బకాయిలు, సబ్సిడీ అందించామని అన్నారు. రైతన్నల మాదిరిగా నేతన్నలకు కూడా నేతన్న భీమా అందిస్తున్నామన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరున పద్మశాలిల కోసం విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉత్తర్ నెంబర్ 1 ద్వారా ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, ప్రభుత్వ సంస్థలకు కావలసిన వస్త్రాలను టేస్కో ద్వారా కొనాలని ప్రభుత్వం ఆదేశించిందని దీని ద్వారా రాష్ట్రంలో చేనేత పవర్ లూమ్ పరిశ్రమల అభివృద్ధితో పాటు నేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించబడుతుందని అన్నారు. నూలు డిపోను నడపడానికి రూ.50 కోట్లు కార్పస్ ఫండ్ క్రింద మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు మెరుగైన పథకాలు తెస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డ్ గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్యలను, చింతకింది మల్లేశం సంత్ కబీర్ దాస్ అవార్డు గ్రహీత, సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ హ్యాండీక్రాఫ్ట్స్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, హడ్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, జగన్నాధం మురళి, చేనేత, జౌళిశాఖా అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, జాయింట్ డైరెక్టర్లు ఎన్ వెంకటేశ్వర్లు, ఇందుమతి దేవి, ఓఎస్‌డి బాషా, జిఎమ్ అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను ఓర్వలేకే విమర్శలు

హర్షవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజల ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నమ్మకంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఏడాది పాలనపై ప్రజలు సంబరాలు చేసుకుంటుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విషాన్ని చిమ్ముతున్నాయని ఆరోపించారు. ఓర్వలేకనే ఈ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ఏడాది సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 160 సంక్షేమ పథకాలతో ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లో 53,132 ఉద్యోగాలు భర్తీ చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపినట్లు తెలిపారు. జిల్లాకు ఒక ఏడాదిలోనే అభివృద్ధి కోసం రూ.15వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 30 శాతం కూడా పనులు చేయని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించడంతోపాటు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశచరిత్రలో ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లు తెలిపారు. సాంకేతికపరమైన కారణాల వల్ల మిగిలిపోయిన వారికి ఇటీవలే రైతురుణమాఫీ చేయడం జరిగిందన్నారు. యువతకు. చేయూత అందించాలనే ఉద్దేశంతో స్కిల్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టడం జరిగిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. జిల్లాలో దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాలకు కూడా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమానికి పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, మాజీ కౌన్సిలర్ బాలస్వామి. నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతిపక్ష నేతల కుట్రలను తిప్పికొడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తి చేసుకుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో రెండు పండగలు జరుపుకుంటున్నామని.. ఓ వైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'ప్రజాపాలన విజయోత్సవాలు తెలంగాణ ఇచ్చిన శ్రీమతి సోనియాగాంధీ జన్మదిన ఉత్సవాలు మరోవైపు జరుపుకోవడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మహేష్ గౌడ్ సోమవారం శాసన మండలిలో మీడియాతో మాట్లాడారు. మాటకు కట్టుబడి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా పాలనా విజయోత్సవాలు పండగ, తెలంగాణ ప్రజల పండగని ఈ ఉత్సవాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం రూపొందిందని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో రాజకీయ నేతలు పార్టీలకు అతీతంగా పాల్గొనాలని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ పునర్వికాసం వైపు పయనిస్తోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకి చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు రాష్ట్ర అభివృద్ధికి సహకరించడం లేదని, రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమేనని, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ హయంలో పదేళ్ల పాలన గడీలకు, ఫామ్‌హౌస్‌లకే పరిమితమైందని.. కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజలకు పాలన చేరువయ్యేలా.. ప్రజాస్వామ్య పంథాలో నడుస్తోందని మహేష్ గౌడ్ వెల్లడించారు. గాంధీభవన్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు అంతకుముందు గాంధీభవన్‌లో సోనియాగాంధీ 79వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఏఐసీసీ ఇన్చార్జి దీపా దాస్ మున్షీ, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే అందించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షులు గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అటెండర్ టెక్నీషియన్స్ ప్లంబర్ డ్రైవర్ దోబి ఎలక్ట్రిషన్ మ్యానిఫర్డ్ టైలర్ తదితర విభాగాల కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వేతన బకాయిలను అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా మాదిరిగా ఒకటో తేదీనే వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జనరల్ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్, గోపాల్ నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ నిర్వాహన చూసే ఏజెన్సీ కాంట్రాక్టర్లు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు అందించకుండా నెలల తరబడి పెండింగ్లో ఉంచుతూ ఒప్పంద ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక పర్యాయాలు ఏజెన్సీ నిర్వాహకులను అడిగిన బడ్జెట్ లేదని ఇతరత్ర కారణాలు చూపుతూ దాటవేసే ధోరణి అనుసరిస్తున్నారని మండిపడ్డారు. ఒకపక్క ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతినెల ఒకటవ తేదీనే వేతనాలు అందిస్తున్నామని చెబుతుంటే ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం వేతనాలకు వేచిచూసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా మాదిరిగా కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వేతనాలు సక్రమంగా ప్రతి నెల అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ వేతనాలు అందించకపోతే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఏఐటీయూసీ సంఘం బ్రాంచ్ నేతలు, ఒప్పంద ఉద్యోగులు బుచ్చన్న, పాండు, శ్రీను, బాలకృష్ణ, మురళి, నరసింహ, జ్యోతి, ప్రత్యుష, రత్నమ్మ, భాగ్యలక్ష్మి, యాదయ్య, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

13న ఐయామ్ ఫినోమ్ ఇండియా ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గ్లోబల్ ఏఐ దిగ్గజం ఫినోమ్, భారత్‌లో తన వేగవంతమైన వృద్ధి ప్రణాళికను ప్రకటించింది. 13న హైదరాబాదులోని హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించనున్న ఐయామ్ ఫినోమ్ ఇండియా కార్యక్రమం ద్వారా, భారత మార్కెట్‌లో తమ వ్యూహాత్మక దృక్పథాన్ని ప్రదర్శించనుంది. ఈ కార్యక్రమం 500కి పైగా సీనియర్ హెచ్ఆర్ నాయకులను ఒక వేదికపైకి తీసుకురావడం ద్వారా, టాలెంట్ అక్విజిషన్, మేనేజ్‌మెంట్, భవిష్యత్తు ఉద్యోగాలపై లోతైన చర్చలకు ప్రేరణగా నిలవనుంది. భారతదేశం, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా, ఫినోమ్ గ్లోబల్ వ్యూహంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఏఐ, ఆటోమేషన్ పరిష్కారాలను భారతీయ సంస్థల అవసరాలకు అనుగుణంగా రూపొందించడం ద్వారా, ఉద్యోగ నియామకం, టాలెంట్ అభివృద్ధి, ఉద్యోగుల ఉత్పాదకతను పెంపొందించడంలో సహాయం చేస్తోంది. ఫినోమ్ అధ్యక్షుడు, సీఓఓ సహ వ్యవస్థాపకుడు హరి బాయిరెడ్డి మాట్లాడుతూ, "భారతదేశం ఫినోమ్‌కు ఒక వ్యూహాత్మక కేంద్రంగా ఉంది. 6,000 కంటే ఎక్కువ పెద్ద సంస్థలతో, ఇక్కడ టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్నోవేషన్‌కి అపార అవకాశాలు ఉన్నాయి. ఐయామ్ ఫినోమ్ ఇండియా ద్వారా, మేం ఉద్యోగ నియామకం నుండి రిటెన్షన్ వరకు నూతనతను తీసుకురావడానికి కట్టుబడి ఉన్నాం," అని తెలిపారు.

రైలు కార్యకలాపాల భద్రతా చర్యలపై సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ రైలు కార్యకలాపాల భద్రత, సమయపాలనపై తీసుకోవలసిన చర్యలపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు మొత్తం 6 డివిజన్లు అనగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ జోన్‌లో రైళ్ల రాకపోకల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. భద్రతకు సంబంధించిన సిగ్నలింగ్, ఇంజనీరింగ్, స్టేషన్ ఆస్తులకు సంబంధించిన భద్రత సంబంధిత ఆస్తుల పనితీరుపై దృష్టి సారించి క్షేత్ర స్థాయి తనిఖీలను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైళ్ల సమయపాలన పైన చర్చించారు. 3వ లైన్ కు సంబందించిన నిర్మాణ పనులు, చలికాలంలో పొగమంచు సమస్యలతో సంబంధం లేకుండా రైళ్లను సకాలంలో నడిపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డీఆర్ఎంలను ఆయన ఆదేశించారు. అరుణ్ కుమార్ జైన్ ప్రస్తుతం కొనసాగుతున్న 3వ లైన్ నిర్మాణ పనులు, ప్రైవేట్ సైడింగ్‌ల నిర్వహణ సంబంధిత పనుల పురోగతిపై చర్చించారు. రైలు నిర్వహణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, ట్రాక్‌ను ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రైవేట్ సైడింగ్‌లలో తరచుగా తనిఖీలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైల్వే ఆస్తులను సురక్షితంగా భద్రంగా నిర్వహించడం ప్రాముఖ్యతపై కూడా ఆయన చర్చించారు. రైల్వే ఆస్తులను కాపాడే నైతిక బాధ్యత ప్రతి రైల్వే ఉద్యోగిపై ఉందని, భద్రతకు హాని కలిగించే ఏవైనా సందర్భాల్లో ఉన్నతాధికారులకు తెలియజేయవలసిన బాధ్యత రైల్వే ఉద్యోగులందరి మీద ఉందని ఆయన పేర్కొన్నారు.

రైల్వే బోర్డు నిర్దేశించిన భద్రతా నియమాలను, సలహాలను అమలుపై కూడా ఆయన చర్చించుతూ జోన్‌లో వాటిని ఖచ్చితంగా పాటించాలని నొక్కి చెప్పారు.

15న బెంగుళూరులో ఆస్రా జాతీయ సదస్సు

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : వినియోగదారుల ఫోరం ద్వారా నాణ్యమైన సేవలు రావాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ సీనియర్ నేత ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా వినియోగదారుల కేసులు ఆస్రా ద్వారా పరిష్కారించడం హర్షణీయం అన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబీలీటీ (ఆస్రా) ఆధ్వర్యంలో ఈనెల 15న బెంగుళూరులో జరిగే 6వ జాతీయ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ముఖ్య అతిథిగా హాజరై ఆస్రా వ్యవస్థాపక అధ్యక్షులు హబీబ్ సుల్తాన్ తో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం వారి హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ఉచితంగా న్యాయం అందించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఆస్రా ఏర్పడిందన్నారు. ఆస్రా ఫౌండర్ హబీబ్ మాట్లాడుతూ సంస్థ 2016లో ప్రారంభమై 12 రాష్ట్రాల్లో 1000 మంది స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నారని, ఆస్రా సంస్థ ప్రతి సంవత్సరం ఆస్రా నేషనల్ సమ్మిట్ నిర్వహిస్తుందన్నారు. డిసెంబర్ 15న 6వ జాతీయ సదస్సు బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక పౌర సరఫరాల వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి మునియప్ప, ఐఏఎస్ విజయ్ జోష్న తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్రా తెలంగాణ అధ్యక్షులు వెంకటేష్ గుప్త, ప్రతినిధులు కీర్తి, సుమన్, ఖైలేష్, ప్రశాంత్, శిరీష పాల్గొన్నారు.

పట్టణ పారిశుద్ధ్యంపై అవగాహన

విశాలాంధ్ర - కాప్రా : జి.హెచ్.ఎం.సి అధికారులు వినూత్నమైన విధానంతో ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా రోడ్ల పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారస్తుల నుండి చెత్త రోడ్లపై వేయడానికి అవకాశం ఉన్న ప్రతి పాన్ షాప్, టీ స్టాల్ టిఫిన్ సెంటర్లు, జ్యూస్ బండ్లు షాపుల వారు, గప్ చుప్ అమ్మే వ్యాపారస్తులు వైన్ షాపుల వద్ద వాటర్ బాటిల్స్, వాటర్ ప్యాకెట్స్ మిర్చి బజ్జీలు అమ్ముకునే స్థలాల వద్ద మైక్ ద్వారా కస్టమర్లకు అవగాహన కల్పిస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా షాపు యజమాని సరిపడా డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని లేనియెడల వెయ్యి రూపాయల నుండి 5000 రూపాయల వరకు జరిమానా విధించబడునని కస్టమర్లు ఎలాంటి వ్యర్థాలను అనగా టీ కప్పులు, పాన్ పరాగ్, గుట్కా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, వాడిన వాడి పడేసే సిగరెట్ డబ్బాలు, అగ్గిపెట్టెలు ప్లాస్టిక్ గ్లాసులు, ధర్మకోల్ ప్లేట్లు, కప్పులు, సంబంధిత వ్యాపార స్థలాలలో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని, ఇలాంటి వ్యర్థాలను రోడ్లపై వేసినచో కస్టమర్కు వంద రూపాయల నుండి 500 రూపాయలు పెనాల్టీ విధించబడునని కాప్రా జిహెచ్ఎంసి అధికారులు తెలియజేస్తున్నారు. షాపు యజమాని అందుకు తగిన డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకొనిచో 1000 రూపాయల నుండి 5000 రూపాయలు జరిమానా విధించబడునని డిప్యూటీ కమిషనర్ కాప్రా తెలియజేస్తున్నారు. ఈరోజు ప్రారంభించిన ఈ వినూత్న కార్యక్రమంలో కాప్రా సర్కిల్ హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం సెక్షన్ హెడ్ ప్రశాంత్, శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ అశోక్, కృష్ణ, ఎస్ ఎఫ్ ఏ మంజుల, శిరీష, అశ్విని ప్రసాద్, అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి మైకులను ఏర్పాటు చేసుకున్న షాపు యజమానులను అభినందిస్తూ శాలువా, బొకేతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని సర్కిల్లో అన్ని ప్రాంతాలకు విస్తరింప చేస్తూ అందరూ షాపు యజమానులను చేసుకుని ప్రజలను చైతన్యవంతులను చేయాలని పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపడడానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, ఇలా చేయడం వలన కాప్రా సర్కిల్ పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపడడంలో ఒక అడుగు ముందుకు వేయవచ్చని, కాప్రా సర్కిల్ డిఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రశాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాకెట్ రోడ్‌లో గల మైసమ్మ టీ స్టాల్, దీపక్ పాన్ షాప్, కంచమ్మ టీ పాయింట్, హై టెన్షన్ రోడ్‌లో బాలాజీ టీ స్టాల్, రాధిక రోడ్లో గోల్డెన్ టీ పాయింట్, రాథోడ్ టీ పాయింట్ దాదాపు 8 షాపు యజమానులు ఈ మైకును అమర్చుకున్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రధాత సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విచ్చేసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం కొత్తగా నియమింపబడిన యూత్ కాంగ్రెస్ కమిటీ సభ్యులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రాలో: సోనియాగాంధీ 78వ జన్మదిన సందర్భంగా నాచారంలో వై జయంతి సినిమా థియేటర్ ఎదుట కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర లేబర్ సెల్ వైస్ చైర్మన్, ఐ ఎన్ టి యు సి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వి. ఎస్. ప్రకాష్ రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనిని ఆయన అన్నారు. నాచారం డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, డి. క్రిష్ణా రెడ్డి, మావిడాల రాజిరెడ్డి, హెచ్ఆర్ మోహన్, మెతుకు శ్రీనివాస్ రెడ్డి, వి.ఎస్.టి. శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ఈసుప్, ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు ఉమ, షెరీఫ్, రఘు, రమేష్ గౌడ్, అస్వద్ దామరెడ్డి, బాలరాజు గౌడ్, క్రిష్ణా యాదవ్, చందు, భారతమ్మ, విజయ, నూతనగంటి రాజు, కుద్దుష్, తుంగ తిరుపతి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆమనగల్లులో: నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల స్వరాష్ట్ర ఆకాంక్షను సహకారం చేసిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీకే దక్కిందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహ, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. కెసిఆర్ తెలంగాణ వ్యూహ కర్త మాత్రమేనని తెలంగాణ బిడ్డల ఆత్మ గోష చూసి సోనియా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని వారు పేర్కొన్నారు. అమనగల్లు పట్టణంలో సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. సోనియా గాంధీ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటాలు చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు తగిన సమయంలో తగువిధంగా గుర్తింపు ఉంటుంది అన్నారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గం అధ్యక్షుడు దళపతి గౌడ్, మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, పిఎంసి డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు కృష్ణ నాయక్, తల్లోజు రామకృష్ణ, అప్పం శ్రీను, కాలే మల్లయ్య, కండె సాయి, రాజశేఖర్, వెంకట్ రెడ్డి, పర్వతాలు, ఖలీల్, అలిమ్, సురేష్ నాయక్,నాజర్, ఫరీద్, మహేష్, ఖాదర్ ఖాద్రి, బాబా, మైసయ్య, మస్నగిరి, రఫీ, షాబుద్దీన్, పరమేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కారేపల్లిలో: జాతీయ కాంగ్రెస్ నాయకురాలు మాజీ యుపిఏ చైర్మన్ రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ చలువ వల్లనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ కుటుంబం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, గుగులోత్ భీముడునాయక్, సురేందర్ మనియర్, దారావత్ భద్రు నాయక్, మేదరి వీరప్రతాప్ (టోనీ), కారేపల్లిటౌన్ అధ్యక్షులు పొలాగని శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షలు కడియాల సుధాకర్ నాయకులు ఎండి హనీఫ్, తాజుద్దీన్, మాజీద్ పాషా, గుగులోత్ భగవాన్ దాస్, బానోత్ రాంచందర్, వాంకుడోత్ గోపాల్ నాయక్, బోడ సెగ్రాం, శ్రీనివాస్, యకూబ్, గుగులోత్ హచ్చు, వాంకుడోత్ సక్రు, మంగీలాల్, సునవత్ వస్రం, నవీన్, తాడ్వాయి రాములు, కళ్యాణ్, అంగోత్ రాందాస్, తాహిద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్‌లో: తెలంగాణ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న మహా నాయకురాలు సోనియాగాంధీ అని ఆమె తెలంగాణకు తల్లి లాంటిదని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య నేతృత్వంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు జరిగితే చివరకు సోనియా గాంధీ ధైర్యంతో పార్లమెంటు తలుపులను మూసి తెలంగాణ ఇచ్చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని గౌరవించి ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకొని తెలంగాణను పాలించడానికి దశా దిశా మార్గ నిర్దేశం చేసిన మహనీయురాలు సోనియా గాంధీ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల కోసం సోనియా ఆరు గ్యారంటీలను ఇచ్చి మరింత భరోసా కల్పించారన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ జెడ్పీటీసి పి వెంకట్రామిరెడ్డి, చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, రఘు, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, అందే మోహన్, శ్రీనివాస్ యాదవ్, అగనూరు బస్వం, తుపాకుల శేఖర్, ముబారక్ అలీ, ఖదీర్, మురళీమోహన్, ఉస్మాన్, కృష్ణారెడ్డి, బచ్చలి నరేష్, ప్రవీణ్, అశోక్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్‌లో: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని కంటెస్టడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం గాజులరామరం 125 డివిజన్‌లో 'ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల వేడుకలు కంటెస్టడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ విధంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోనియాగాంధీ 79వ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సిహెచ్ బుచ్చిరెడ్డి, దాస్ శీను రవి నారాయణ రెడ్డి నగర్ వైస్ ప్రెసిడెంట్, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, రవి నారాయణ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి, టిపిసిసి కార్యదర్శి పున్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దమ్మనిశ్రవణ్ కుమార్, రషీద్ బేగ్, ఐలయ్య గౌడ్, యాం సాగర్, తోఫిక్, జహంగీర్, పూలమ్మ, పద్మ, లాల్ మహమ్మద్, కృష్ణ యాదవ్, శ్యామల,గుమస్తా మధుసూదన్, చాంద్ భాషా, బండి శ్రీనివాస్ గౌడ్, గంగారాం, కాజా భాయ్, షాకీర్, మల్లం శ్రీను, శివ నాయక్, సతీష్, మల్లారెడ్డి, ఈగ ఆంజనేయులు, అరుణ్ కుమార్, లింగం యాదవ్, వెంకటేష్ యాదవ్, భూషణం గౌడ్, రాధిక, కల్పనా రెడ్డి, సంతోష్, రాజి రెడ్డి, చక్రి, రాజేందర్ రెడ్డి, మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు అరుణ్ కుమార్ గౌడ్ సల్మాన్, చోటు, పులి సందీప్, నరేష్ గౌడ్, సంతోష్ తదిత రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కూకట్‌పల్లిలో: బాలాజీ నగర్ డివిజన్ జనతా నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్మంచ్ కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ పాల్గొని పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి అనంతరం పిల్లలకు పుస్తకాలు, పండ్లు కేక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం, గూడెపు నాగరాజు, గోపిశెట్టి రాఘవేంద్ర, గొట్టిముక్కుల వెంకటేశ్వరరావు, తుమ్ వేణు, కృష్ణ రాజ్ పుత్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జిట్టా రమ్యకృష్ణ, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యుఐ నాయకులు జాంగిర్, శంకర్, రాహుల్ సింగ్, సుశీల్ యాదవ్, రవి, యశ్వంత్, ఇషు, లక్కీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్‌లో: రంగారెడ్డి జిల్లా జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బిజారం అంజయ్య, రఫీఖ్ అహ్మద్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు సంకల్పంతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కే.నరసింహారెడ్డి, జి సురేష్, ఎస్. జంగయ్య, ఏ.హరీశ్వర్ రెడ్డి, అమ్జద్ ఉల్లాహ్, బి.జంగయ్య, శేఖర్, జంగయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లిలో : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని చందానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సౌందర్య రాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి జై సోనియమ్మ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగినా 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన త్యాగశీలి సోనియా గాంధీ అని గుర్తుచేశారు. మిరియాల రాఘవ రావు, జెరిపేటి రాంచందర్, రఘుపతి రెడ్డి, ఊరిటీ వెంకట్ రావు, వీరేందర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్ రాజ్, మహమ్మద్ జహంగీర్, అల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు మరేలా శ్రీనివాస్, గఫూర్, విష్ణువర్ధన్ రెడ్డి, కట్ల శేఖర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, మహమ్మద్ అజీముద్దీన్, కాటికే రాజేందర్, నర్సింహ గౌడ్, అయాజ్ ఖాన్, శివ కుమార్, సుదర్శన్, శివ కుమార్ ఆశీల, కృష్ణ, చిన్న, గోపాల్, అశోక్, సుధాకర్, నర్సింహ, శ్రీహరి గౌడ్, కార్తీక్ గౌడ్, పద్మ రావు, రవి కుమార్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్, దిలీప్, సాయి కిషోర్ ముదిరాజ్, హనీఫ్, రషీద్, కుమార్ యాదవ్, మౌలానా, యాదయ్య, వెంకట్ నారాయణ, మధు, మహేందర్ కొడిచర్ల, జెరిపేటి రాజేష్, మహిళలు పార్వతి, తన్వీర్, జయ, శాంత, లలిత, పద్మ,విజయలక్ష్మి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 118 ధరఖాస్తులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్ఎంసి వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హెడ్ ఆఫీస్‌తో పాటు జీహెచ్ఎంసి వ్యాప్తంగా మొత్తం 118 ఫిర్యాదులు వచ్చాయి. జీహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 2 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. హెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 52 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 22, ఎఫ్.ఏ సెక్షన్ 12, ట్యాక్స్ సెక్షన్ 8, ఇంజనీరింగ్ 3, వెటర్నరీ సెక్షన్, శానిటేషన్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ 2 చొప్పున, స్పోర్ట్స్ సెక్షన్‌కు ఒకటి చొప్పున విన్నపాలు అందాయి. జీహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 66 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 36, ఎల్బీనగర్ జోన్ లో 10, సికింద్రాబాద్ జోన్‌లో 8, శేరిలింగంపల్లి జోన్‌లో 2, ఖైరతాబాద్ జోన్‌లో 4, చార్మినార్ జోన్‌లో 6 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, సత్యనారాయణ, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, సిసిపి శ్రీనివాస్ అడిషనల్ సిసిపి గంగాధర్, వాటర్ వర్క్స్ జి ఏం సాయి రమణ, హౌసింగ్ యస్ఈ పీవీ రమణ రాజేశ్వర్‌రావు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలో ప్రవేటు రంగం రోజురోజుకు విస్తరిస్తున్నది .ప్రభుత్వం నుండి అనేక రాయితులు పొందుతున్న ప్రైవేట్ రంగ సంస్థల్లో రిజర్వేషన్ విధానాలు లేకపోవడం మూలంగా దళితులకు ప్రవేటు రంగంలో ప్రాధాన్యత లేకుండా పోతుందని ఏఐడిఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్ పాండే అన్నారు. సోమవారం రోజున హిమాయత్ నగర్ రాజ్ బౌద్ధూర్ హాల్లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏఐడిఆర్ఎం రెండవ జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఏం బాల నరసింహ, డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె యేసు రత్నం, మారుపాక అనిల్ కుమార్, డిహెచ్పిఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ రాజ్ కుమార్, జె కుమారస్వామి, డిహెచ్పిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. లక్ష్మీనారాయణ, కే సహదేవతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మల్ పాండ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారులు కట్టిన తర్వాత దేశవ్యాప్తంగా దళితుల పైన ఆదివాసులపైన దాడులు తీవ్రతరం చేశారు. దళితులకు రాజ్యాంగ బద్ధంగా చెందవలసిన హక్కులను సైతం మోడీ ప్రభుత్వం కల రాస్తుందని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను ఆలంబిస్తూ దేశ సంపదను కొద్దిమందికే చిందే విధంగా తన పరిపాల విధానాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ దేశంలో అనేక సంవత్సరాలుగా సమాజానికి దూరంగా ఉన్న దళితులకు ఈ దేశ సంపదలో వాటా దక్కకుండా అభివృద్ధికి ఆమడ దూరంగా చేసే విధంగా మనుధర్మ విధానాలను ఆలంబిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు యం బాల నరసింహ మాట్లాడుతూ అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహాసభలు 2025 జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జరగనున్నాయి. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మూడు రోజుల పాటు సుదీర్ఘంగా చర్చించి దేశవ్యాప్తంగా ఉద్యమ కార్యచరణ రూపొందించుకోవడానికి ఈ మహాసభలో వేదిక కానున్నాయని ఆయన అన్నారు. ఈ మహాసభలను విజయవంతం కొరకు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు అందరూ సహాయ సహకారాలను అందించాలని ఆయన కోరారు.

తాండ్ర వీరేందర్ రెడ్డి మృతి తీరని లోటు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, న్యాయవాద రంగాల్లో దురంధరుడు రైతు నాయకుడు తాండ్ర వీరేందర్ రెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంతిమ కన్నీటి వీడ్కోలు పలికారు. వీరందరెడ్డి కుమారుడు శ్రావణ్ రెడ్డి,విశాల దంపతులకు తన సానుభూతి తెలియజేశారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన తాండ్ర వీరేందర్ రెడ్డి నియోజకవర్గంలోనే ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు. షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆయన న్యాయ రంగంలో అనేక సేవలు అందించారు. రాజకీయాల్లో తనదైన ముద్రను వేసుకున్నారు. తెలుగుదేశం, బిఆర్ఎస్ పార్టీల్లో ఎనలేని సేవలను అందించారు. రాజకీయాల్లో ముఖ్యులుగా ఉన్నారు. 1980 దశకంలో షాద్ నగర్ రాజకీయాల్లో చురుకైన నాయకుడిగా వీరేందర్ రెడ్డికి పేరు ఉంది. నియోజకవర్గంలో వీరేందర్ రెడ్డి లాంటి ముక్కుసూటి మనస్తత్వం గల నాయకులు ఎవరూ లేరని అన్నారు. ఎంతో నిజాయితీగా ఆయన అడంబరాలు లేకుండా జీవితాన్ని గడపారని వీరందరెడ్డి ఒక దమ్ము ఒక ధైర్యం అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని అన్నారు. అంతేకాదు ఈ ప్రాంతంలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలపై రాజీలేని పోరాటాన్ని నిర్వహించి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపును పొందారు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్ నాయకులు, నియోజకవర్గంలోని ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున అంత్యక్రియలో హాజరయ్యారు.

జేపీసీ నూతన కమిటీలను ఏర్పాటు

విశాలాంధ్ర - కూకట్‌పల్లి: హైదరాబాద్‌లోని జేఎన్టీయూ యూనివర్సిటీలో సోమవారం జేపీసీ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా మంద రంజిత్ కుమార్‌ను ఎన్నుకోగా జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులుగా కోత్తూరు పవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జేఎన్టీయుహెచ్ యూనివర్సిటీ అనుబంధ కాలేజీల్లో జేఏసీ కమిటీలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర జేఏసీ కమిటీ దృష్టి సారించామని, దానితో పాటుగా విద్యార్థుల సమస్యలను ప్రాతినిధ్యం చేసే "స్టూడెంట్స్ మేనిఫెస్టో" కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తాయని, జేఎన్టీయుహెచ్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర సభ్యులు తెలియజేశారు.

రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లో రైల్వే ట్రాక్ ఇరువైపుల ఉన్న చెత్తాచెదారం, చెట్టుకొమ్మల తొలగింపు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, జిహెచ్ఎంసి ఏఎంహెచ్ ఓ మంజుల, రైల్వే అధికారులు మల్లికార్జున్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఇందిరా నెహ్రూ నగర్‌లో ఉన్న రైల్వే ట్రాక్ ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి క్రిమి కీటకాలకు అండగా మారిందన్నారు. దానివల్ల పరిసర ప్రాంతాలు నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సోమవారం సిబ్బందితో వచ్చి జెసిపి ద్వారా రైల్వేట్రాక్ ఇరువైపుల ఉన్న చెత్తా చేరడంతో పాటు చెట్టుకొమ్మలను సైతం తొలగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, పారిశుద్ధ్య జవాన్ అలీ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగంలో సానిటరీ సూపర్వైజర్స్‌ల అక్రమాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టి కార్మికులకు న్యాయం చేయాలని టిజిహెచ్ఈయు యూనియన్ కమీషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. డిప్యూటీన్ పై వచ్చిన సానిటరీ సూపర్వైజర్స్‌ను జిహెచ్ఎంసి నుండి వారి మాతృ సంస్థలకు పంపించాలని టిజిహెచ్ఈయు యూనియన్ కమిషనర్‌ని కోరడం జరిగింది. కార్మికులకు ఇవ్వవలసిన పని ముట్లలో కూడా వీరు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవడం జరుగుతుందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కార్మికులకుకిచ్చే జాడ్ కట్టలు, పౌడరు, కామటికి గంపలు, పారలు ఏవి కూడా సకాలంలో ఇవ్వకున్న, ఇస్తున్నామని సానిటరీ సూపర్వైజర్స్‌ల లెక్కలలో చూపించుకుంటూ వాటిని బయట అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. సానిటరీ సూపర్వైజర్స్ డిప్యూటేషన్ కాలం ముగిసినా గానీ వీరు ఇక్కడే పని చేస్తున్నారని, జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగంలో శానిటరీ సూపర్వైజర్స్ బయట నుండి రావడం జరుగుతుంది. మన జిహెచ్ఎంసిలో ఎంతోమంది సీనియర్ జవాన్స్ ఉన్నారని, వీరికి శానిటేషన్ పట్ల అవగాహన ఉన్నదని, కాబట్టి వీరిలోనే చదువుకున్న వారిని చూసి ఇంచార్జ్ సానిటరీ సూపర్వైజర్ గా పెట్టడానికి అవకాశాలు ఉన్నాయని, కాబట్టి సానిటరీ సూపర్వైజర్స్ ను మాతృ సంస్థకి పంపించి జవాన్లకు సానిటరీ సూపర్వైజర్స్ గా అవకాశం కల్పించాలని కమీషనర్ ను కోరారు. జిహెచ్ఎంసికి బయట నుండి వచ్చిన శానిటరీ సూపర్వైజర్‌కి ఇచ్చే జీతాల ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంటుందని కాబట్టి ఈ విషయాన్నీ కమిషనర్ దృష్టికి తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ తీసుకెళ్లారు.

చిలుముల అజయ్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మేడిపల్లి : యూత్ కాంగ్రెస్ మండల ఎన్నికల్లో విజయం సాధించిన మేడిపల్లి మండల్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల అజయ్ కుమార్ రెడ్డి, మేకల సాయి కిరణ్ రెడ్డిలను సోమవారం ఉదయం డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణకి భారీగా తరలిన నాయకులు

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు బోడుప్పల్ పార్టీ కార్యాలయం నుండి తెలంగాణ తల్లీ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ మంద సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భారీగా తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ మేయర్ సామల బుచ్చి రెడ్డి, పార్టీ నాయకులు కొత్త రవి గాడ్, రాంచంద్రారెడ్డి ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు వారంలోగా పరిష్కరించాలి



విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు వచ్చే సోమవారంలోగా పరిష్కారం కావాలని అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరివన్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని ప్రజలు వివిధ సమస్యలపై ప్రజావాణిలో అందించే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని అదనపు కలెక్టర్లు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 490 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అట్టి దరఖాస్తులను వచ్చే సోమవారం లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్జీదారుల నుండి అర్జీలను అదనపు కలెక్టర్లు కదిరవన్, ముకుంద రెడ్డిలు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో 490 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణ శాఖకు 419, పెన్షన్లు 34, జిల్లా విద్యాశాఖ 05, డిఎస్ఓ 08, జిల్లా సంక్షేమ శాఖలు 04, ఇతరాలు 20 దరఖాస్తులు వచ్చినవని వారు తెలిపారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేదించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు జి ఆశన్న, ఆర్.కోటజీ, ఇలియాజ్ అహ్మద్, శ్రీరామ్, ఆర్.రోహిణి, అపర్ణ, సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

మోదీ, అదానీ మాస్కులతో కాంగ్రెస్ ఎంపీలు

పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ వినూత్న నిరసన

న్యూఢిల్లీ: పార్లమెంటు ఆవరణలో సోమవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. అదానీ అవినీతిపై ఇండియా పక్షాల నిరసనలో భాగంగా ఇద్దరు కాంగ్రెస్ ఎంపీలు మోదీ, అదానీ మాస్కులతో దర్శనమిచ్చారు. వారిని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పరిహాసం చేయడం అందరినీ ఆకర్షించింది. కాంగ్రెస్ ఎంపీలు మాణిక్యం ఠాగూర్, సప్తగిరి శంకర్ మోదీ, అదానీ మాస్కులు ధరించి నిరసనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వారిని స్వయంగా ఫోటోలు తీశారు. తమ మధ్య బంధమేంటో చెప్పాలంటూ వారితో పరిహాసమాడారు. దానికి ఆ పాత్రధారులు.. "ఏం చేసినా మేం కలిసే చేశాం.. మాది ఏళ్లనాటి బంధం" అని సమాధానమిచ్చారు. పార్లమెంటును ఎందుకు అనుమతించడం లేదని అదానీ మాస్క్ వేసుకున్న కాంగ్రెస్ ఎంపీని రాహుల్ గాంధీ ప్రశ్నించగా... 'మేము అమిత్ భాయ్‌ని అడగాలి... ఆ వ్యక్తి తప్పిపోయాడు" అని అన్నారు. వీరిద్దరి మధ్య ఉన్న సంబంధాల గురించి అడగ్గా...'మేము కలిసి ఉన్నాము' అని అన్నారు. మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారనే దానిపై కాంగ్రెస్ ఎంపీ అదానీలా ఫోజులిస్తూ 'ఈరోజుల్లో ఈ వ్యక్తి టెన్షన్‌లో ఉన్నాడు' అంటూ నవ్వులు పూయించారు. మీ తదుపరి ప్రణాళిక ఏమిటి ? ఇప్పుడు ఏం కొనాలని ప్రతిపాదించారు అని అడిగిన ప్రశ్నకు, 'మేము ఇంకా నిర్ణయించుకోలేదు. ఈ సాయంత్రం మాకు సమావేశం ఉంది." అంటూ అదానీ మాస్క్ ధరించిన కాంగ్రెస్ ఎంపీ సమాధాన మిచ్చారు. మోదీ, అదానీ ఒకటేనని చెప్పే క్రమంలో కాంగ్రెస్ పార్టీ వినూత్న రీతిలో ఈ విధంగా చేసింది. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ తమ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేయగా... ఇది వైరల్‌గా మారింది. అనంతరం ఎప్పటిలాగే ఇండియా ఎంపీల నిరసన కొనసాగింది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేపాటు ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు 'మోదీ, అదానీ ఏక్ హై', 'మాకు న్యాయం కావాలి' అంటూ నినాదాలు చేశారు. కాగా తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు నిరసనలో పాల్గొనలేదు. అయితే సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ....ఈ విషయానికి అంత ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం లేదని ప్రతిపక్ష కూటమిలో 'అంతా బాగానే ఉంది' అని స్పష్టం చేశారు. నిరసనలో భాగంగా వామపక్షాలు, డీఎంకే, శివసేన (యూబీటీ), ఆర్జేడీ, ఎన్సీపీ ఎంపీలు నినాదాలు చేస్తూ అదానీ గ్రూప్ ముడుపుల వ్యవహారం పై పార్లమెంటులో చర్చ జరిపి జేపీసీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా లోక్‌సభ సెక్రటేరియట్ మెట్లపై నిరసన చేయరాదని పేర్కొన్న నేపథ్యంలో పార్లమెంటు మకర ద్వార్ మెట్ల ముందు నిరసన ప్రదర్శన జరిగింది. శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ అంశంపై పార్లమెంట్ ఆవరణలో ఇండియా ఐక్యసంఘటన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అమెరికా కోర్టులో అదానీ, ఇతర కంపెనీ అధికారులపై అభియోగాలు మోపిన నేపథ్యంలో కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణ డిమాండ్ చేస్తున్నాయి. అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

బంగ్లాతో సత్సంబంధాలు కోరుకుంటున్నాం

భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీల భద్రతపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం ఢాకాలో బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి మహ్మద్ జషీముద్దీన్, విదేశాంగశాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్‌తో చర్చలు జరిపారు. 'మైనారిటీల భద్రత ,సంక్షేమానికి సంబంధించిన వాటితో సహా మా ఆందోళనలను నేను తెలియజేశాను. సాంస్కృతిక, మతపరమైన, దౌత్యపరమైన ఆస్తులపై దాడులకు సంబంధించిన కొన్ని దురదృష్టకర సంఘటనలపై కూడా మేము చర్చించాము" అని మిస్రీ ఇక్కడ విలేకరులతో అన్నారు. బంగ్లాదేశ్‌తో అన్ని విధాలుగా సత్సంబంధాలను భారత్ కోరుకుంటోందని స్పష్టం చేశానని తెలిపారు. తమ చర్చలు ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను పరిశీలించేందుకు వీలు కల్పించాయని మిస్రీ చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తడంతో చర్చలు జరిపేందుకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై.. ముఖ్యంగా ఇస్కాన్ ప్రచారకర్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ గురించి చర్చించినట్లు మిస్రీ మీడియాతో పేర్కొన్నారు. బంగ్లాదేశ్ దళాలు భారత సరిహద్దుల్లో డ్రోన్లను మోహరించిన విషయంపై మాట్లాడామన్నారు. ఇక్కడి యూనస్ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఎదురు చూస్తున్నామని వెల్లడించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు తీవ్ర పరిస్థితులకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వీరిద్దరూ ఢాకా నుంచి పనిచేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బంగ్లాదేశ్ పర్యటన ప్రాముఖ్యత సంతరించుకుంది.

బుర్కినా ఫాసో భారత రాయబారి ఓం ప్రకాశ్ మీనా

న్యూఢిల్లీ: బుర్కినా ఫాసో దేశానికి భారత తదుపరి రాయబారిగా ఓం ప్రకాశ్ మీనా నియమితులయ్యారు. త్వరలో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ సోమవారం వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఓం ప్రకాశ్ మీనా 1979 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

రూ.44.50 లక్షల విలువ చేసే గోవా మద్యం పట్టివేత

రాప్తాడులో నలుగురి అరెస్ట్

విశాలాంధ్ర-రాప్తాడు: అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలో రూ.44.50 లక్షల విలువ చేసే గోవాకు చెందిన 440 బాక్సుల మద్యం సీసాలను సోమవారం సాయంత్రం ఎక్సైజ్ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య వివరాలు వెల్లడించారు. గంగలకుంట రైల్వే గేట్ సమీపంలో ఉన్న ఒక వ్యవసాయ తోటలోని రేకులషెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 440 బాక్సుల గోవా లిక్కర్ మాన్షన్ హౌస్ సీసాలను సీజ్ చేశామని తెలిపారు. తోటలో ఉంటున్న వాచ్‌మెన్‌తో సహా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఈ మద్యం యజమాని శివారెడ్డి అలియాస్ వెంకటశివకుమార్ రెడ్డిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. రాప్తాడు సమీపంలో భారీ స్థాయిలో మద్యం నిల్వ చేశారనే విషయం రెండు రోజుల క్రితం పక్కా సమాచారం అందిందన్నారు. దీనిపై లోతుగా విచారణ చేసి సోమవారం ఉదయం అనంతపురంలో కొందరిని అరెస్టు చేసి విచారణ చేస్తే మధ్యాహ్నం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ ఏపీలో రూ.44.50 లక్షలు ఉంటుందని, గోవాలో రూ.23 లక్షల విలువ ఉంటుందని వివరించారు. వాచ్‌మెన్‌ను విచారిస్తే ఇక్కడ మూడు రోజుల క్రితం నిల్వ చేసినట్లు చెప్పాడని, ఈ తోట రాప్తాడుకు చెందిన దండు కుమార్‌దని, వీరి దగ్గర నుంచి అనంతపురానికి చెందిన నందు అనే వ్యక్తి ఎనుములను పెట్టుకుని పాల వ్యాపారం చేసేవాడని అన్నారు. అతని దగ్గర నుంచి అనంతపురానికి చెందిన వెంకటశివారెడ్డి తోటను లీజుకు తీసుకొని పౌల్ట్రీల వ్యాపారం చేసుకుంటూ అక్రమంగా మద్యం తీసుకువచ్చి వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్‌లు రేవతి, అన్నపూర్ణ, సునంద, సుహాసిని, అలీబేగ్, సీఐలు జయరాజ్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ పెన్షన్ల ఏరివేత !

- జిల్లాకు ఒక గ్రామ సచివాలయం లక్ష్యం
- ఒక్కో బృందానికి 40 ఇళ్లు
- అనర్హులని తేలితే... కట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెన్షన్ల తొలగింపు ప్రక్రియపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. తొలి విడతగా జిల్లాకు ఒక గ్రామ, వార్డు సచివాలయం కేంద్రంగా ఈ పెన్షన్ల తొలగింపు చేపట్టనున్నారు. నేరుగా లబ్దిదారుల ఇంటికే అధికారులు వెళ్లి...వాళ్లు పెన్షనర్లకు అనర్హులా? కారా? అనేది తనిఖీ చేయనున్నారు. ఈ తనిఖీలన్నీ స్థానిక అధికారులు కాకుండా పక్క మండలం అధికారులు నిర్వహిస్తారు. ఒక్కో బృందానికి 40 ఇళ్ల తనిఖీ బాధ్యతల్ని అప్పగించారు. ఈ సమయంలో బోగస్ పెన్షన్ పొందుతున్నారని తేలితే అక్కడిక్కడే దాన్ని రద్దు చేసే దిశగా అధికారులకు ఆదేశాలందాయి. దీని ఆధారంగా ఎవరైతే అనర్హులుగా ఉండి, నెలవారీ పెన్షన్లు పొందుతున్నారో...వారికి ఇక నుంచి పెన్షన్లు ఆగిపోతాయి. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక అర్హులైన వారికే పెన్షన్లు దక్కేలా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆ దిశగా అనేక సమీక్షలతో అధికారులకు దిశానిర్దేశం చేశారు. తప్పుడు పత్రాలతో పొందుతున్న వారంతా పెన్షన్లు వదులుకోవాలని...లేకుంటే ప్రభుత్వమే వారి పెన్షన్లు తొలగిస్తుందని సీఎం హెచ్చరించారు. కూటమి మేనిఫెస్టోలో భాగంగా వృద్ధుల పెన్షన్ రూ.3వేల నుంచి 4వేల వరకు, దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలు, పూర్తి స్థాయిలో వైకల్యానికి నెలకు రూ.15వేలు, కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు నెలకు రూ.10వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ పెన్షన్లలో అత్యధికంగా రూ.4వేలు పొందిన వారే ఉన్నారు. వారిలో కొందరు అనర్హులున్నట్లు ప్రభుత్వానికి సమాచారం వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా తెల్లకార్డులు జారీజేసి...అనర్హులకు పెన్షన్లు ఇవ్వడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్న విమర్శలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వికలాంగుల కోటాలో పెన్షన్లు పొందినట్లు ఆరోపణలున్నాయి. ఈనెల 2వ తేదీ నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసేందుకు అవకాశమిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. దానిపై ఇంతవరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. పెన్షన్ల తొలగింపులో భాగంగా అనర్హులతోపాటు అర్హులైన వారినీ తొలగిస్తారేమోనన్న ఆందోళన పెన్షనర్లలో నెలకొంది.

కేజ్రీవాల్ 'తగ్గేదేలే'... బీజేపీ రప్పా-రప్పా

రెండు పార్టీల పోస్టర్ వార్

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశ రాజధానిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన 'పుష్ప 2' సినిమా స్టిల్స్‌తో అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య పోస్టర్ వార్ మొదలైంది. తగ్గేదేలే అంటూ కేజ్రీవాల్ ఫొటోతో కూడిన ఓ పోస్టర్‌ను ఆప్ విడుదల చేయగా... బీజేపీ కూడా రప్పా-రప్పా పేరుతో దీటుగా స్పందించడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసిన రెండు పార్టీలు... సోషల్ మీడియా సహా అన్ని మాధ్యమాల ద్వారా ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేజ్రీవాల్ 'ఝుకేగా నహీ (తగ్గేదేలే)' అంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ ఇటీవల ఓ పోస్టర్ విడుదల చేసింది. పుష్ప సినిమాలో హీరో ఫోజులో ఉన్న కేజ్రీవాల్... చీపురు చేత పట్టుకొని ఉన్నారు. నాలుగోసారి మళ్లీ అధికారం తమదే అనే అర్థంలో ఆ పోస్టర్‌ను రూపొందించారు. ఆప్‌కు దీటుగా స్పందించిన బీజేపీ కూడా తాజాగా ఓ పోస్టర్ విడుదల చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్... పుష్ప క్యారెక్టర్ తరహాలోనే కుర్చీలో కూర్చున్నట్లు దానిని రూపొందించారు. 'అవినీతిపరులను అంతం చేస్తామంటూ.. 'రప్పా-రప్పా' అని రాసి ఉన్న ఆ పోస్టర్‌ను కాషాయ పార్టీ విడుదల చేయడంతో దిల్లీ రాజకీయాలు ఆసక్తిగా మారాయి. కొన్నేళ్లుగా దేశ రాజధానిలో పాగా వేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ వరుసగా గెలుస్తూ వస్తోంది. 2013, 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఆప్... ఈసారి కూడా అధికారాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు 1998 నుంచి దేశ రాజధానిలో అధికారానికి దూరమైన బీజేపీ... దిల్లీ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది.

ఏపీ కేబినెట్‌లోకి నాగబాబు?

విశాలాంధ్ర-అమరావతి: జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు ఏపీ కేబినెట్‌లో చేరనున్నారు. త్వరలో జనసేన తరపున మంత్రి కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్యను అనుసరించి... రాష్ట్రంలో 25 మంత్రులకు అవకాశం ఉంది. కానీ, ప్రస్తుతం 24 మంది మాత్రమే ఉన్నారు. జనసేన నుంచి ప్రస్తుతం పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ మాత్రమే మంత్రులుగా ఉన్నారు. కానీ, కూటమి పొత్తుల్లో భాగంగా జనసేనకు నాలుగు, బీజేపీకి ఒక మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంది. భర్తీ కావాల్సిన ఆ ఒక్క స్థానాన్ని జనసేనే భర్తీ చేయాల్సి ఉంది. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు రాజ్యసభ అభ్యర్థిగా ఆర్. కృష్ణయ్య పేరును బీజేపీ ఇప్పటికే ఖరారు చేయగా... తాజాగా టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీశ్ పేర్లు ఖరారయ్యాయి. ఈ ముగ్గురు కూటమి అభ్యర్థులు మంగళవారం నామినేషన్ వేయనున్నారు. ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది.

రూ.42 వేల కోట్ల రుణాలు 'రైటాఫ్'

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి భాగంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.42,000 కోట్ల రుణాలను 'రైటాఫ్' చేశాయని ప్రభుత్వం సోమవారం పార్లమెంటుకు తెలిపింది. 2024-25 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ. 8,312 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (రూ. 8,061 కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ. 6,344 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ. 5,925 కోట్లు) విలువైన రుణాలను రైటాఫ్ చేశాయి. దీని ద్వారా రుణాలు రద్దు కావని, రుణాలు తీసుకున్నవారు బకాయిలను చెల్లించాల్సి ఉంటుందని, వారి నుంచి నిధులు వసూలు చేసే ప్రక్రియ కొనసాగుతుందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. బ్యాంకులు వివిధ రికవరీ విధానాల ద్వారా సంబంధిత ఖాతాదారుల నుంచి రికవరీ చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. సమీక్షించిన కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాలు మొత్తం రూ. 42,035 కోట్లు కాగా, రూ. 37,253 కోట్ల రికవరీ జరిగింది. గత 2023-24లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 1.14 లక్షల కోట్ల విలువైన రుణాలను మాఫీ చేసినట్టు మంత్రి వెల్లడించారు.

యూపీఎస్సీ సివిల్స్ (మెయిన్) ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (మెయిన్) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్ పరీక్షలు జరగ్గా... ఈ ఫలితాలను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో జాబితా విడుదలైంది. ఈ ఏడాది మొత్తం 1056 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు యూపీఎస్సీ గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి జులై 1న ఫలితాలు వెల్లడించారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో మెయిన్ పరీక్షలు నిర్వహించిన అధికారులు... తాజాగా ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. త్వరలో నిర్వహించే ఇంటర్వ్యూలో సత్తా చాటిన వారిని ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర (గ్రూప్ ఏ, గ్రూప్ బి) సర్వీసులకు ఎంపిక చేస్తారు.

భారత్‌కు ఐఎన్‌ఎస్ తుషిల్ అప్పగింత

న్యూఢిల్లీ: బహుళ పాత్ర పోషించే స్టీల్త్ గైడెడ్ మిస్సైల్ యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ తుషిల్ సోమవారం జలప్రవేశం చేసింది. రష్యాలోని కాలినిన్‌గ్రాడ్‌లో ఆ నౌకను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఐఎన్‌ఎస్ తుషిల్ జలప్రవేశంతో సముద్ర గస్తీలో భారత సామర్థ్యం పెరుగుతున్నట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఏఐ, కౌంటర్ టెర్రరిజం లాంటి అంశాల్లో భారత్, రష్యా సహకారం కొత్త దశకు చేరుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి, అడ్మిరల్ అలెగ్జాండర్ మోసేవ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐఎన్‌ఎస్ తుషిల్‌ను... రక్షణ కవచంతో పోల్చుతున్నారు. క్రివాక్ 3 క్లాస్ ఫ్రిగేట్‌కు చెందిన అప్‌గ్రేడ్ వర్షన్ ఇది. ఇప్పటికే ఇలాంటి ఆరు యుద్ధనౌకలు భారత నావికాదళంలో ఉన్నాయి. వాటిల్లో మూడు తల్వార్ క్లాస్ ఉన్నాయి. 1135.6 ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఏడవ యుద్ధనౌక ఐఎన్‌ఎస్ తుషిల్. భారతీయ నౌకాదళ నిపుణుల సమక్షంలోనే తుషిల్ నిర్మాణం జరిగినట్లు చెబుతున్నారు. నిర్మాణం తర్వాత అనేకసార్లు ఆ యుద్ధనౌకతో ట్రయల్స్ నిర్వహించారు.

గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల రేసులో భారతీయ సినిమా

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్‌కు భారత్ నుంచి "ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్" అనే సినిమా ఎంపికైంది. పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన ఈ చిత్రం హిందీ, మరాఠీ, మలయాళీ భాషల్లో విడుదలయ్యింది. ఇటీవలి 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శించబడి గ్రాండ్ పిక్స్ సొంతం చేసుకుంది. నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ ద్వారా 2024 యొక్క టాప్ 5 అంతర్జాతీయ చిత్రాలలో ఒకటిగా పేరు తెచ్చుకున్న ఈ సినిమా... తాజాగా గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్ పోటీల్లో రెండు విభాగాల్లో నామినేట్ అయింది. బెస్ట్ నాన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ మోషన్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్ కేటగిరీల్లో నామినేట్ అయిన ఇండియన్ మూవీగా.. హాలీవుడ్ చిత్రాలతో పోటీ పడుతున్నట్టు అవార్డ్స్ జ్యూరీ ప్రకటించింది.

'ఉపాధి'కి ప్రణాళికలు

కష్టజీవులకు ఉపయోగపడేలా పనులు

గ్రామాల రూపురేఖలు మార్చేందుకు చర్యలు

విశాలాంధ్ర-అమరావతి: ఊరికి జీవం పోసేలా ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఓ వైపు కూలీలకు పని కల్పిస్తూనే... మరోవైపు రైతులు, ప్రజలకు ప్రయోజకరంగా ఉండే పనులను గుర్తించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం గ్రామసభలు కూడా నిర్వహించారు. ఈ పనుల ద్వారా గ్రామాల్లో శాశ్వత ఆస్తుల కల్పనకు అవకాశం లభిస్తుంది. గ్రామ సభలో గుర్తించిన పనులు చేసుకోవడానికి ప్రతిపాదనలు రూపొందించి, వాటి మంజూరుకు ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేశారు. గ్రామాల్లో రైతులకు సాగునీరందించే చెరువులు, కాలువలు, చిన్న నీటికుంటలతో పాటు ఇంకుడు గుంతలు, గిరిజనులు, దళితుల భూముల అభివృద్ధి, వారి తోటల్లో రాతికట్టల నిర్మాణం, అదేవిధంగా రైతుల తోటల్లో చెట్ల పెంపకం, వాటి చుట్టూ ట్రెంచ్‌లు, కొండవాలు నీరు ఇంకింపజేసే ట్రాగన్ ట్రెంచెస్, ఉద్యాన వన అభివృద్ధి పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు కూడా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీంతో గత ఐదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు ప్రస్తుతం కొత్త శోభను సంతరించుకుంటున్నాయి.

యుద్ధప్రాతిపదికన కొత్త రోడ్లు

సరైన రహదారి సదుపాయం లేక ఇన్నాళ్లూ ప్రజలు పడిన అవస్థలకు ఈ కొత్త రోడ్ల నిర్మాణంతో పరిష్కారం లభిస్తోంది. ఒకేసారి 26,204 రహదారుల పనులకు పంచాయతీల్లో తీర్మానం చేయించి మూడు నెలల క్రితం ప్రారంభించారు. రూ.2,281.90 కోట్లతో గ్రామాల్లో ప్రస్తుతం యుద్ధప్రాతిపదిక నిర్వహిస్తున్న రోడ్ల నిర్మాణ పనులను మరో 45 రోజుల్లో పూర్తి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి, ఉద్యోగ రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటూ సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వచ్చే వారికి ఈసారి సరికొత్త అనుభూతులను అందించాలని సర్కారు నిర్ణయించింది. ఈ ఐదు నెలల వ్యవధిలో రూ.2,281 కోట్లతో 26,204 రహదారుల పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో 2,298 పనులు పూర్తయ్యాయి. వివిధ దశల్లోని మిగిలిన పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లో అప్పట్లో 25 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లను నిర్మించి రహదారుల సమస్యకు పరిష్కారం చూపారు. గత ఐదేళ్లు గ్రామాలను గాలికి వదిలేయడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో రూ.10,483 కోట్ల మెటీరియల్ నిధులతో 34,586 వివిధ భవన నిర్మాణాలకు అనుమతులిచ్చారు. ఆ ఐదేళ్లలో సగం కూడా పూర్తి కాలేదు.

పనులపై పర్యవేక్షణ ఉండాలి

ఇక రోడ్ల పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి. ఒకేసారి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేసే కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిరంతరంగా ఇలాంటి పర్యవేక్షణ ఉండాలి. మారుమూల గ్రామాల్లో చేస్తున్న పనుల్లో నాణ్యత ఉండటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని జిల్లా, మండల స్థాయిలోనూ బలోపేతం చేయాలి. ప్రజలందరి సమక్షంలో పంచాయతీల్లో తీర్మానం చేసిన పనులే చేపట్టాలి. కొన్ని చోట్ల తీర్మానాలకు విరుద్ధంగా సర్పంచులు తమకు తోచిన చోట, వారి అవసరాలకు వీలుగా రోడ్ల నిర్మాణాలు చేయిస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. ఇలాంటి వాటిని పరిష్కరించాలి. వ్యవసాయ కూలీలకు ఉపాధితో పాటు మెటీరియల్ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. రాష్ట్రంలో ఉపాధి పథకం మెటీరియల్ నిధులతో జిల్లాలు 26, మంజూరైన పనులు 26,204, వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభించిన పనులు 22,662 (86.48 శాతం), ఇప్పటికి పూర్తయినవి 2,298, వివిధ దశల్లో ఉన్నవి 20,364 ఉన్నాయి. ఎమ్మెల్యేలు, సర్పంచుల మధ్య సమన్వయ లోపంతో కొన్ని పంచాయతీల్లో ఇంకా పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గ్రామాల్లో ఆధిపత్యం కోసం ఎమ్మెల్యేలు, పంచాయతీల్లో ఎమ్మెల్యేల జోక్యం ఏమిటని సర్పంచులు గొడవలకు దిగుతున్నారు. వీరి మధ్య వివాదం గ్రామాభివృద్ధిపై పడుతోంది. ఇలాంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.